http://www.agnidharanews.com

# అగ్నిధార

గురువారం 19 మార్చి 2026

నిజాల నిప్పు కణిక

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## 'ఫామ్‌హౌస్' ఘటనతో అప్రమత్తం



- తమ ఆనవాళ్లు దొరక్కుండా జాగ్రత్తపడుతున్న ప్రముఖ మత్తుప్రియులు
- ఫామ్‌హౌస్‌లు, పబ్బులకెళ్లే పలువురు ప్రముఖుల అప్రమత్తం
- డ్రగ్స్ కొనుగోలు, వాడేటప్పుడు ఆనవాళ్లు దొరక్కుండా జాగ్రత్తలు తీసుకుంటున్న వైనం
- డ్రగ్స్ కావాలంటే ముంబయి, బెంగళూరు, గోవాల్లోని పెడ్లర్స్‌కు సమాచారం
- డ్రగ్స్ సరఫరా ముఠాలపై పోలీసుల నిఘా

## ఫామ్‌హౌసుల్లో చీకటి వ్యవహారాలు



- నగరం నిద్రపోతున్న వేళ విందు, వినోదాలు!
- విందులు, వినోదాలు చేసుకునేందుకు కేంద్రాలుగా ఫామ్‌హౌస్‌లు
- రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వెయ్యికి పైగా ఫామ్‌హౌస్‌లు
- వాటిలో సగానికి పైగా మహేశ్వరం జోన్‌లోనే
- అనైతిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నా పట్టించుకోని అధికారులు

హైదరాబాద్

రాజధాని నగరం నిద్రపోతున్న సమయంలో విందులు, వినోదాలు చేసుకునేందుకు ఫామ్‌హౌస్‌లు వేదికలుగా మారుతున్నాయి. మద్యం, డ్రగ్స్, విందులతో పాటు ముజ్రా, రేవ్ పార్టీలూ జరుగుతున్నాయి. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వెయ్యికి పైగా ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. అయితే వాటిలో ఏ ఒక్కదానికీ అనుమతుల్లేవనే విషయం తెలుస్తోంది. వాటిలో సగానికిపైగా మహేశ్వరం జోన్?లోనే ఉన్నాయి. అయితే ఇప్పటికీ ఈ భూములు రెవెన్యూ రికార్డుల్లో పంట పొలాలు, భూములుగానే కొనసాగుతున్నాయి. వీటిని వ్యవసాయేతర భూములుగా (నాలా కన్వర్షన్) మార్చుకున్న తర్వాత మాత్రమే ఆ భూముల్లో ఫామ్‌హౌస్ నిర్మాణాలు వంటివి చేయాలి. అయితే దీనికి విరుద్ధంగా మొయినాబాద్ నుంచి శంకర్‌పల్లి వరకు, నార్సింగి నుంచి సాగర్ రింగురోడ్, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, మంచాల, మహేశ్వరం ప్రాంతాల్లో ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. వాటిలో ఇదివరకు అనైతిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నా పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. తెల్లవార్లూ నిర్వహణ : శంషాబాద్, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, ఇబ్రహీంపట్నం, యాచారం, రాజేంద్రనగర్, చేవెళ్ల, జన్వాడ, హయత్‌నగర్, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో ఇవి ఎక్కువగా ఉన్నాయి. అయితే వీటిలో రాజకీయ నాయుకులు, ప్రజా ప్రతినిధులు తరచూ వచ్చి అక్కడే సెటిల్‌మెంట్లు - మిగతా3లో

## పేద ప్రజలకు ఇళ్లు ఇవ్వడమే లక్ష్యం



- ఇందిరమ్మ ఇళ్లు ఎన్నికల హామీ కాదు, ప్రజా పాలనలో అర్హులైన అందరికీ ఇళ్లు ఇస్తాం
- శాసన మండలిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, మంజూరు సమస్యలపై విపక్షాల ప్రశ్నలు
- 3,24,593 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని స్పష్టం చేసిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు నిరంతర ప్రక్రియ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టంచేశారు. శాసన మండలిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, మంజూరు సమస్యలపై ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి, మధుసూధనాచారి ప్రశ్నలు అడిగారు. టాటా ఏస్ లాంటి కిరాయి వాహనం నడుపుకుంటే ఫోర్ వీల్స్ వాహనం కింద లెక్కేసి ఇందిరమ్మ పథకానికి అనర్హుడని చెబుతున్నారని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే బేస్‌మెంట్లు కట్టుకున్న ఇళ్లను అనుమతించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్నికల హామీ కాదని, ప్రజా పాలనలో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటివరకు 3,24,593 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఏడాదికి 4 లక్షల 50 వేల చొప్పున నిర్మిస్తాం అని చెప్పిందని, మరి ఆ విధంగా ఆ హామీ అమలు కావడం లేదని మండలిలో ప్రతిపక్ష నేత మధుసూధనాచారి అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెప్పిన విధంగా దానికి బడ్జెట్ - మిగతా3లో



## రాజకీయాల్లో విరమణ అంటూ ఉండదు

- రాజ్యసభలో ప్రధాని మోదీ
- పదవీవిరమణ చేసిన ఎంపీలు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపు
- దేవెగౌడ, పవార్ నుంచి కొత్తగా ఎన్నికైన ఎంపీలు పాఠాలు నేర్చుకోవాలని ప్రధాని మోదీ సూచన
- "సభలో వివిధ అంశాలపై చర్చలు జరుగుతాయి. వాటిలో ప్రతి సభ్యుడు ఒక ప్రత్యేక పాత్ర పోషిస్తారు
- కొన్ని మంచితో పాటు చెడు అనుభవాలు ఎదురవుతుంటాయి.

## ముంచుకొస్తున్న ఏఐ సంక్షోభం

- రాజులు పోయినా, రాజ్యాలు పోయినా వారి రాచరిక పోకడలు ఇంకా పోలేదు
- సీఎం రేవంత్ రెడ్డి
- నియంత పోకడలతో బీఆర్ఎస్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందన్న సీఎం
- సమయం, సందర్భం లేకుండా నచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆక్షేపణ
- సభ సాంప్రదాయాలను గౌరవించకపోడం తెలంగాణ సంస్కృతికి విరుద్ధమన్న రేవంత్ రెడ్డి
- 'ఎన్నో త్యాగాల ఫలితం మన దేశ స్వాతంత్ర్యం
- కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘపోరాటంతో స్వాతంత్ర్యం వచ్చింది



హైదరాబాద్

అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం తెలంగాణ అభివృద్ధికి విశిష్ఠ ప్రణాళిక అని అన్నారు. ప్రతిపక్షం ధన్యవాదాలు తెలుపుతుందని ఆశించామని, హుందాగా ప్రవర్తించకుండా అహంకారం ప్రదర్శించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘపోరాటంతో స్వాతంత్ర్యం వచ్చింది. పేదవాడికి బ్యాంకింగ్ రంగాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది ఇందిరా గాంధీ. నెహ్రూ కట్టిన ప్రాజెక్టులను మనం గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తు ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది. బీఆర్ఎస్ ఇంకా అహంకార ధోరణి మార్చుకోలేదు. రాజులు పోయినా, రాజ్యాలు పోయినా రాచరిక పోకడలు పోలేదని బీఆర్ఎస్ పార్టీ తీరుపై సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలతో - మిగతా3లో



## రూ.1000 ఈపీఎఫ్ పెన్షన్ ఒక జోక్

- మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ ఫైర్?!
- 'ఈపీఎఫ్ కనీస పెన్షన్ సరిపోదు
- కార్మికుల, ఉద్యోగుల సంక్షేమం కోసం కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలి'- కాంగ్రెస్ డిమాండ్

## మూసీ తొలి దశ డీపీఆర్ సిద్ధం



- ఇంత త్వరగా ఎలా అన్న కేటీఆర్
- శాసనసభలో వాడీవేడి చర్చ
- మూసీ ప్రాజెక్టుపై శాసనసభలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాదోపవాదాలు
- తొలి దశ డీపీఆర్ సిద్ధమైందన్న మంత్రి శ్రీధర్ బాబు
- ప్రజలను ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందని కేటీఆర్ ఆరోపణ

హైదరాబాద్

మూసీ నది ప్రక్షాళనపై శాసనసభలో వాడీవేడి చర్చ సాగింది. బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చిన మంత్రి శ్రీధర్ బాబు మూసీ ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించిన డీపీఆర్ సిద్ధమైందని, రూ.6,500 నుంచి రూ.7,000 కోట్లు అవుతుందని అంచనా వేసినట్లుగా పేర్కొన్నారు. సుమారు 1,435 నిర్మాణాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని, తుది ఎన్యుమరేషన్ - మిగతా3లో





## ఈడీ సోదాలను సీఎం అడ్డుకోవడం సరికాదు

- సీఎం మమతపై సుప్రీంకోర్టు అసహనం
- ఈడీ సోదాలు మమత అడ్డుకోవడాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు
- అది హర్షించదగిన పరిణామం కాదని వ్యాఖ్య

# ‘రాజకీయాల్లో విరమణ అంటూ ఉండదు’

రాజకీయాల్లో విరమణ అంటూ ఏమి ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. రాజ్యసభలో పదవీకాలం ముగిసిన సభ్యులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ, పదవీవిరమణ చేసిన సభ్యులు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. సభ నుంచి వెళ్లేవారు కొత్తగా వచ్చేవారికి స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. సభలో చర్చలు జరిగేటప్పుడు ఎన్నో రకాలు వాదనలు జరుగుతాయన్న మోదీ, ప్రజా ప్రయోజనాల పరిరక్షణే వాటి అంతిమ లక్ష్యమన్నారు.

“సభలో వివిధ అంశాలపై చర్చలు జరుగుతాయి. వాటిలో ప్రతి సభ్యుడు ఒక ప్రత్యేక పాత్ర పోషిస్తారు. కొన్ని మంచితో పాటు చెడు అనుభవాలు ఎదురవుతుంటాయి. ఇలాంటి సందర్భాల్లోనే పార్టీలకతీతంగా అందరిలో పరస్పర గౌరవ భావం ఏర్పడుతుంది. తమ పదవీ కాలం ముగిసి సభను వీడుతున్న సభ్యులకు నేను ఒక్కటి చెప్పాలనుకుంటున్నా. రాజకీయాల్లో ఎప్పుడు ముగింపు ఉండదు. మీ అనుభవాలు, మీ సేవలను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది.”

**కొత్తగా ఎన్నికైన ఎంపీలు పాఠాలు నేర్చుకోవాలని ప్రధాని మోదీ సూచన**

హెచ్‌డీ దేవెగౌడ, మల్లిఖార్జున ఖర్గే, శరద్ పవార్ వంటి సీనియర్ నాయకుల నుంచి కొత్తగా ఎన్నికైన ఎంపీలు పాఠాలు నేర్చుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. వీరంతా తమ జీవితంలో సగానికి పైగా పార్లమెంటరీ సేవలోనే గడిపారని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్? హరివంశ్?కు వీడ్కోలు తెలిపారు. సౌమ్యుడు, మృదుభాషి అయినా కఠిన నిర్ణయాలు తీసుకునే వ్యక్తిగా ఆయనను ప్రశంసించారు. విరామ సమయాల్లో కూడా



హరివంశ్ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ, జాతీయ ప్రాముఖ్యం గల అంశాలపై యువతతో మమేకమయ్యారని గుర్తు చేశారు.

“ హెచ్‌డీ దేవెగౌడ, మల్లిఖార్జున ఖర్గే, శరద్ పవార్ తమ జీవితంలో సగానికి పైగా పార్లమెంటరీ సేవలో గడిపిన సీనియర్ నాయకులు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వారి నుంచి పాఠాలు నేర్చుకోవాలి. సభలో హాస్యం, వ్యంగ్యానికి చాలా అవకాశం ఉందని మనం అప్పుడప్పుడు వింటూనే ఉంటాం. ఈ రోజుల్లో బహుశా అది క్రమంగా తగ్గుతోంది. కానీ మన అఠవాలే మాత్రం ఆ విషయంలో ఎప్పటికీ ఎవర్?గ్రీన్?గా నిలుస్తారు. ఆయన వ్యంగ్యం, హాస్యాన్ని అందిస్తూనే ఉంటారని నాకు పూర్తి నమ్మకం ఉంది.”

**‘పాత, కొత్త పార్లమెంట్ భవనాల్లో పనిచేసిన అరుదైన ఘనత సొంతం’**

పదవీ విరమణ చేస్తున్న కొందరు సభ్యులు పాత, కొత్త పార్లమెంట్ భవనాలు రెండింటిలోనూ పనిచేసిన అరుదైన ఘనతను సాధించారని మోదీ అన్నారు. జీవితాన్ని తీర్చిదిద్దుకోవడానికి ఆరేళ్ల రాజ్యసభ పదవీకాలం అమూల్యమైన అవకాశమని చెప్పారు.

**ప్రేమ మాతో పెళ్లి మోదీతో : ఖర్గే**

మరోవైపు రాజ్యసభలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ప్రసంగించిన కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలు, ప్రజా జీవితంలో ఉన్నవారు దేశానికి సేవ చేయాలనే తపనతో అలసిపోకుండా, పదవీ విరమణ చేయకుండా ఉంటారన్నారు. ఈ క్రమంలోనే మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడతో తనకు 54 ఏళ్లకు పైగా ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఉన్నవారు దేశానికి సేవ చేయాలనే తపనతో అలసిపోరు, విరమించుకోరు. నాకు దేవెగౌడ 54 ఏళ్ల ముందు నుంచి తెలుసు. నేను ఆయనతో చాలా కాలం పనిచేశాను. ఆ తర్వాత ఏమైందో నాకు తెలియదు. ఆయన మమ్మల్ని ప్రేమించి, మోదీని పెళ్లి చేసుకున్నారు.” అంటూ చమత్కరించారు.

**26 స్థానాలు ఏకగ్రీవం**

కాగా, ఇటీవలె 10 రాష్ట్రాల్లోని 37 రాజ్యసభ స్థానాల భర్తీకి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో 26 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, మిగిలిన స్థానాలుకు పోలింగ్ నిర్వహించింది. ఇందులో బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్?, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్?, ?ావీ చీఫ్ ఉపేంద్ర కుష్వాహా సహా పలువురు గెలిచారు. అటు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఆర్పీఐ (ఏ) అధినేత రాందాస్ అఠావలె, అన్నాడీఎంకే నాయకుడు తంబిదురై, కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ, బీజేపీ సీనియర్ నాయకుడు వినోద్ తావ్డే, తృణమూల్ నేత బాబుల్ సుప్రియో తదితరులు ఉన్నారు.

# రూ.1000 ఈపీఎఫ్ పెన్షన్ ఒక జోక్

ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్) కనీస పెన్షన్ ఇప్పటికీ రూ.1000 మాత్రమే ఉండటం ఒక జోక్ లాంటిదని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తప్పకుండా తగిన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేసింది. పెరిగిన ధరల దృష్ట్యా ఈపీఎఫ్ కనీస పెన్షన్ సరిపోదని, దీన్ని గౌరవప్రదమైన స్థాయికి పెంచాలని ఓ పార్లమెంటరీ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. దాదాపు 12 ఏళ్ల మోదీ పాలనలో చాలా సామాజిక భద్రతా పథకాలను క్రమంగా బలహీనపర్చడం లేదా ఉద్దేశపూర్వకంగా విస్మరించడం జరిగిందని ఆయన ఆరోపించారు. ద్రవ్యోల్బణం పెరుగుతూపోతున్నా, ఈపీఎఫ్ కనీస పెన్షన్‌ను ఇప్పటిదాకా అస్సలు పెంచలేదన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా హిందీలో ట్వీట్ చేశారు.

**భారీ ద్రవ్యోల్బణంలో, అతి తక్కువ పెన్షన్**

“ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం - 1995 ప్రకారం ఇప్పుడున్న కనీస నెలవారీ పెన్షన్ రూ.1000పై వెంటనే సమీక్ష నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంటరీ కమిటీ సిఫారసు చేసింది. కేవలం వెయ్యి రూపాయల కనీస పెన్షన్ నేటి అవసరాలను తీర్చలేదని కమిటీ నివేదించింది. నేటి జీవన వ్యయాలకు తగిన విధంగా, పెన్షనర్ల గౌరవప్రదమైన జీవితానికి ఉపయోగపడే స్థాయికి కనీస పెన్షన్‌ను పెంచాలని ఆ కమిటీ ప్రభుత్వానికి సూచించింది. కనీస పెన్షన్ ఇంత తక్కువగా ఉండటం వృద్ధులు, ఆర్థికంగా బలహీనులైన పెన్షనర్లను నేరుగా ప్రభావితం చేసింది. కేంద్ర ప్రభుత్వం తప్పుడు విధానాల వల్ల ఇప్పుడు ద్రవ్యోల్బణం తీవ్రస్థాయిలకు పెరిగిపోయింది. ఆరోగ్యసంరక్షణ వ్యయాలు కూడా చుక్కలను అంటాయి. నిత్యావసరాల ధరలు రాకెట్ వేగంతో పెరుగుతున్నాయి. ఇటువంటి తరుణంలో ఈపీఎఫ్ కనీస



పెన్షన్ రూ.1000 మాత్రమే ఉండటం ఒక జోక్ లాంటిది” అని ట్వీట్‌లో జైరాం రమేశ్ పేర్కొన్నారు.

మోదీ సరకార కే పిఛలే లగభగ 12 సాల కే కార్యకాల మేం సామాజిక సురక్షా కీ కఈ యోజనాఏం ధీరే-ధీరే కమజోర హోతీ చలీ గఈ హైం, యా ఉన్హేం జానబూఝకర కమజోర కర దియా గయా హై।

పేంశన జైసీ బునియాదీ సువిధా భీ లంబే సమయ సే బఢ?తీ మహంగాఈ కే బావజూద లగభగ జస కీ తస బనీ హుఈ హై।

**ఈ నివేదికతోనైనా ప్రభుత్వం చర్యలను చేపట్టాలి**

“ఈపీఎఫ్ కనీస పెన్షన్ అంశం అనేది సామాజిక భద్రత, కోట్లాది మంది రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగుల గౌరవప్రదమైన జీవితాలతో ముడిపడినది. కార్మికులు, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఒక బీజేపీ లోక్‌సభ ఎంపీ సారథ్యంలో ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రూపొందించిన ఈ నివేదిక ఆధారంగానైనా ప్రభుత్వం చర్యలను చేపట్టాలి. ఇప్పటికైనా సర్కారు మేల్కొనాలి. కనీస పెన్షన్ పెంపు దిశగా అడుగులు వేయాలి” అని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు.

**కార్మిక సంఘాల డిమాండ్ : పార్లమెంటరీ కమిటీ అధ్యయనం**

కార్మికులు, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ గ్రాంట్ల డిమాండ్లపై 15వ నివేదికను ఇటీవలే కేంద్ర ప్రభుత్వానికి అందించింది. ప్రస్తుతం రూ.1000గా ఉన్న ఈపీఎఫ్ కనీస పెన్షన్‌పై వెంటనే సమీక్ష నిర్వహించాలని సర్కారుకు సిఫారసు చేసింది. ఈపీఎఫ్ కనీస నెలవారీ పెన్షన్‌ను రూ.7,500కు పెంచాలని కార్మిక, ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈమేరకు డిమాండ్‌తో మార్చి 9న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మూడు రోజులు నిరసన తెలిపాయి. ఏళ్లు గడిచినా, జీవన వ్యయాలు, నిత్యావసరాల ధరలు భారీగా పెరిగినా కనీస పెన్షన్‌ను అందుకు అనుగుణంగా పెంచకపోవడాన్ని కార్మిక, ఉద్యోగ సంఘాలు తప్పుపడుతున్నాయి. దీనిపై ఈ సంఘాలు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పెద్దసంఖ్యలో వినతిపత్రాలను సమర్పించాయి. దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న వృద్ధులు, నిరుపేద వర్గాల పెన్షనర్ల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈపీఎఫ్ కనీస నెలవారీ పెన్షన్‌ను పెంచాలని కోరాయి. ఇదే అంశంపై కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ కూడా పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి తన వాదనను వినిపించింది. ప్రస్తుతం ఈపీఎఫ్ పరిధిలో ఉన్న సభ్యులందరికీ 1.16 శాతం చొప్పున కంట్రిబ్యూషన్‌ను అందిస్తున్నామని కార్మిక శాఖ తెలిపింది. దీంతోపాటు ప్రతినెలా రూ.1000 కనీస పెన్షన్ చెల్లింపునకు నిధులనూ ప్రభుత్వమే సమకూరుస్తోందని పేర్కొంది. అయినప్పటికీ కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం పక్షానే పార్లమెంటరీ కమిటీ సిఫారసులు చేసింది. నెలవారీ కనీస పెన్షన్‌ను పెంచాలని కోరింది.

# రాజస్థాన్‌లో మినీ స్విట్జర్లాండ్ ప్రీవెడ్డింగ్ షూట్‌లకు సూపర్- ఎంట్రన్స్ ఫ్రీ

రాజస్థాన్‌లో ఉన్న ‘స్నో యార్డ్’ చూపరులను ఆకట్టుకుంటోంది. ఒకప్పుడు పారిశ్రామిక వ్యర్థాల డంపింగ్ యార్డ్‌గా ఉన్న ఈ ప్రదేశం నేడు ‘మినీ స్విట్జర్లాండ్’గా పేరు పొందింది. అలాగే ప్రస్తుతం రోజుకు వేలాది మంది పర్యటకులకు సందర్శనీయ ప్రదేశంగా మారిపోయింది. మార్బుల్ వ్యర్థాలతో ఏర్పడిన ఈ తెల్లటి మంచు వంటి ప్రదేశంలో ప్రీ వెడ్డింగ్ షూట్‌లు, సినిమా షూటింగ్స్ కూడా జరుగుతాయి. అంతలా ‘స్నో యార్డ్’ ప్రాచుర్యం పొందింది. ఈ క్రమంలో ‘స్నో యార్డ్’ ప్రత్యేకతలేంటి? దాన్ని సందర్శించాలంటే రుసుము చెల్లించాలా? ‘మినీ స్విట్జర్లాండ్’గా పేరొందడానికి గల కారణాలేంటి? తదితర విషయాలు తెలుసుకుందాం. ‘స్నో యార్డ్’ సందర్శించడానికి ఎటువంటి ఎంట్రీ, పార్కింగ్ రుసుము కట్టాల్సిన అవసరం లేదు. వెహికల్‌పై వచ్చినవారు వాహన రిజిస్ట్రేషన్ నంబరును తప్పనిసరిగా నమోదు చేయాలి. కాగా, సాధారణ రోజులలో ఇక్కడకు 2,000- 2,500 మంది టూరిస్టులు వస్తారు. వీకెండ్స్ (శని, ఆదివారాలు), హాలీడేస్‌లో రోజుకు 5,000- 6,000 మంది స్నో యార్డ్‌ను సందర్శిస్తారు. శీతాకాలంలో టూరిస్టుల సంఖ్య భారీగా పెరుగుతుంది. రోజుకు 10,000 మందికి పైగా పర్యటకులు ఈ ప్రదేశాన్ని చూడడానికి తరలివస్తారు.

**చిన్నారుల కోసం పార్క్**

స్నో యార్డ్‌లోకి ప్రవేశించగానే పిల్లలు ఆడుకోవడానికి ఒక పార్కు ఉంటుంది. అలాగే అడ్వెంచర్స్ కోరుకునేవారు రైడ్‌లు చేయవచ్చు. అయితే వీటిని రుసుము కట్టాల్సిందే. అలాగే ఆ ప్రాంతంలో గుర్రపు స్వారీ, జీప్ సఫారీలు చేయొచ్చు. స్నో యార్డ్ ప్రాంతానికి ఫుడ్‌కోర్ట్ కూడా ఉంది. ఇందులో పర్యటకులకు అనేక రకాల ఆహారం, పానీయాలు దొరుకుతాయి. ఫుడ్‌కోర్ట్‌ను దాటిన వెంటనే ఒక హెలిప్యాడ్ ఉంది. మరింత ముందుకు వెళితే విశాలమైన తెల్లని భూభాగం చాలా దూరం విస్తరించి ఉంటుంది. వాటి మధ్యలో నీటితో నిండిన పెద్ద గోతులు కనిపిస్తాయి. అవన్నీ ప్రకృతి రమణీయతకు అద్దం పడతాయి. చూపరులను ఇట్టే కట్టిపడేస్తాయి. అయితే ఈ ‘స్నో యార్డ్’ అజ్మీర్ జిల్లా కిషన్‌గఢ్‌లో ఉంది. కిషన్‌గఢ్‌లోని మార్బుల్ మార్కెట్ ఆసియాలోనే అతిపెద్దది. అంతేకాకుండా గత దశాబ్ద కాలంగా ఇది గ్రానైట్ వ్యాపారానికి ఒక ప్రధాన కేంద్రంగా నిలుస్తోంది. ఇది భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా గొప్ప ఖ్యాతిని సంపాదించుకుంది. ఇక్కడి నుంచి మార్బుల్స్ దిగుమతి, ఎగుమతి రెండూ జరుగుతాయి. అయితే కిషన్‌గఢ్‌లోనే ఒక్క మార్బుల్ గని కూడా లేకపోవడం గమనార్హం. కాగా, కిషన్‌గఢ్ మార్బుల్ అసోసియేషన్ ‘స్నో యార్డ్’ ఏర్పాటులో కీలక పాత్ర పోషించింది. అలాగే దాన్ని నిర్వహణను చూసుకుంటోంది. అయితే ఈ స్నో యార్డ్ ఏ ప్రణాళికాబద్ధమైన ప్రాజెక్ట్‌లో భాగంగా ఏర్పాటు చేయలేదు. ఒక వ్యర్థ ప్రదేశం నుంచి అగ్రశ్రేణి పర్యాటక ప్రదేశంగా రూపాంతరం చెందింది. ఇదే విషయం గురించి మార్బుల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సురేశ్ వివరించారు. “మార్బుల్ కటింగ్, పాలిషింగ్ తర్వాత మిగిలిన తెల్లటి స్లర్రీని



నిర్వహించడానికి ఈ స్థలాన్ని 2005లో 322 బిఘాల (సుమారు 200 ఎకరాలు) విస్తీర్ణంలో పర్యావరణ అనుకూల డంపింగ్ యార్డ్‌గా అభివృద్ధి చేశారు. కాలక్రమేణా మార్బుల్ నుంచి వచ్చే సన్నని తెల్లని అవశేషం ఆ ప్రాంతమంతా వ్యాపించింది. వర్షపు నీటి కారణంగా ఆ తెల్లటి బురద మట్టి అడుగున చేరి, నేలపైన ఒక ప్రత్యేకమైన పొరగా ఏర్పడింది. ఆ తర్వాత ఈ ప్రాంతం మంచు క్షేత్రాలను పోలిన విశాలమైన తెల్లని ప్రదేశంగా మారి టూరిజం ప్లేస్‌గా అవతరించింది. గతంలో సన్నని మార్బుల్ ధూళి స్థానిక ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపేది. అయితే ఈ డంపింగ్ యార్డ్‌లో అతి సన్నని మార్బుల్ ధూళి పేరుకుపోయి నేలపై ఒక మందపాటి పొరగా ఏర్పడింది. ఇది సందర్శకులకు మినీ స్విట్జర్లాండ్‌లో ఉన్నామనే అనుభూతిని కలిగించే వాతావరణాన్ని సృష్టించింది. అసలైన డంపింగ్ యార్డును ‘స్నో యార్డ్’గా మార్చిన తర్వాత మార్బుల్ స్లర్రీని పారవేయడం కోసం 2009లో 532 బిఘాల (330 ఎకరాలు) విస్తీర్ణంలో ప్రత్యేక డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేశారు.” అని సురేశ్ స్పష్టం చేశారు. గత దశాబ్ద కాలంలో అజ్మీర్‌కు వచ్చే పర్యటకులకు స్నో యార్డ్ తప్పక సందర్శించవలసిన ప్రదేశంగా మారింది. పుష్కర్, అజ్మీర్ షరీఫ్ దర్గా, ఖాటు శ్యామ్ ఆలయం, సలాసర్ బాలాజీ ఆలయాన్ని సందర్శించే యాత్రికులు తరచుగా స్నో యార్డ్ తమ యాత్రా ప్రణాళికలో చేర్చుకుంటున్నారు.

## ఈడీ సోదాలను సీఎం అడ్డుకోవడం సరికాదు

బంగాల్ సీఎం మమతా బెనర్జీపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. జనవరి 8న కోల్‌కతాలోని ఐప్యాక్ కార్యాలయంలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలను సీఎం మమత అడ్డుకొని, అంతరాయం కలిగించడాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టింది. అది హర్షించదగిన పరిణామం కాదని న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ అంశంపై ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు వింటూ భారత సర్వోన్నత న్యాయస్థానం ఈ కామెంట్స్ చేసింది. ఈ విధమైన అసాధారణ పరిస్థితుల్లో ఈడీ సోదాలకు, విధి నిర్వహణకు ఆటంకం కలిగితే, దానికి ఒక రాజ్యాంగపరమైన పరిష్కారం అనేది లేని పరిస్థితి ఉండకూడదని బెంచ్ పేర్కొంది. ఒకవేళ భవిష్యత్తులో ఈడీ సోదాలకు వేరొక ముఖ్యమంత్రి అడ్డుతగిలితే పరిస్థితేంటి? ఈడీ ఎలాంటి రాజ్యాంగపరమైన పరిష్కారానికి నోచుకోకుండానే ఉండిపోవాలా? అని ధర్మాసనం ప్రశ్నించింది.

సీఎం మమత, అధికారులపై కేసులు నమోదుచేయాలి: ఈడీ

ఎన్నికల సలహాలను అందించే ఐప్యాక్ సంస్థ చీఫ్ ప్రతీక్ జైన్ కోల్‌కతా నివాసంలో జనవరి 8న తాము చేసిన సోదాలను సీఎం మమతా బెనర్జీ అడ్డుకున్నారంటూ సుప్రీంకోర్టును ఈడీ ఆశ్రయించింది. తమ సోదాలు జరుగుతుండగానే ప్రతీక్ జైన్ నివాసంలోకి సీఎం ప్రవేశించి, ల్యాప్‌టాప్, ఫోన్, పలు డాక్యుమెంట్లను తీసుకెళ్లారని ఆరోపించింది. సీఎం హోదాలో ఉన్న మమతా బెనర్జీ ఇలా చేయడం తీవ్రమైన అధికార దుర్వినియోగమేనని సుప్రీంకోర్టుకు ఈడీ తెలిపింది. ఈవిధంగా వ్యవహరించినందుకు ముఖ్యమంత్రి మమతపై, ఆమెతో కలిసి ఈడీ దర్యాప్తుకు అంతరాయం కలిగించిన రాష్ట్ర అధికారులపై పోలీసు కేసులు నమోదు చేయాలని దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరింది.

**ఈడీకి పిటిషన్ వేసే అవకాశమివ్వడం సమాఖ్య వ్యవస్థకు ముప్పు: బంగాల్ ప్రభుత్వం**

ఈ వ్యవహారంలో బంగాల్ రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ అడ్వకేట్ శ్యామ్ దివాన్ వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పిటిషన్‌ను దాఖలు చేసే అవకాశాన్ని ఒక కేంద్ర ప్రభుత్వ విభాగానికి కల్పించడం అనేది దేశ సమాఖ్య వ్యవస్థకు ముప్పు లాంటిదని శ్యామ్ దివాన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలపై పిటిషన్లు వేసే హక్కు సీబీఐ, ఈడీ, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ వంటి దర్యాప్తు సంస్థలకు లేదన్నారు. రాష్ట్రస్థాయి దర్యాప్తు సంస్థలైన సీఐడీ, విజిలెన్స్ కమిషన్, యాంటీ కరప్షన్ బ్యూరోలకు కూడా ఇలాంటి హక్కు లేదని ఆయన సుప్రీంకోర్టులో వాదన వినిపించారు.

**ముఖ్యమంత్రే సోదాలను అడ్డుకుంటే ఏం చేయాలి?**

ఈక్రమంలో న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా జోక్యం చేసుకొని కీలక ప్రశ్నలు అడిగారు. నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రే కేంద్ర దర్యాప్తు సంస్థ సోదాలను అడ్డుకునే అసాధారణ పరిస్థితులు తలెత్తితే ఏం చేయాలని ఆయన ప్రశ్నించారు. ఈ కేసులో తమ సోదాలను స్వయంగా సీఎం మమతా బెనర్జీయే అడ్డుకున్నారని కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ఆరోపిస్తోందని న్యాయమూర్తి గుర్తుచేశారు. “ఒకవేళ ఆర్టికల్ 226ను అమలు చేయలేకపోతే, ఆర్టికల్ 32ను కూడా అమలు చేయలేరు. అలాంటప్పుడు ఎవరు నిర్ణయిస్తారు? భవిష్యత్తులో వేరొక ముఖ్యమంత్రి, వేరొక దర్యాప్తు సంస్థ సోదాలకు అడ్డుతగలొచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగపరమైన పరిష్కారమేంటి అనే విషయంలో శూన్యత ఉండకూడదు” అని న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు.

**నేరుగా కేంద్ర ప్రభుత్వమే చర్యలను చేపట్టాలి: బంగాల్ ప్రభుత్వ అడ్వకేట్**

తదుపరిగా బంగాల్ ప్రభుత్వం తరఫు న్యాయవాది శ్యామ్ దివాన్ వాదనను కొనసాగిస్తూ, ఇలాంటి అంశాలకు రాజ్యాంగం ఒక పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర దర్యాప్తు సంస్థ సొంతంగా కాకుండా, నేరుగా కేంద్ర ప్రభుత్వమే తగిన చర్యలను చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యపై నెలకొన్న శూన్యత కారణంగా, విస్తృత ధర్మాసనం ద్వారా అధికారిక నిర్ణయం అవసరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈవిధంగా దర్యాప్తు సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వాలపై పిటిషన్లు వేసే అవకాశాన్ని కల్పిస్తే, ఇందులో కోర్టులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని న్యాయవాది శ్యామ్ దివాన్ చెప్పారు. దీనివల్ల దేశ సమాఖ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరిష్కారానికి నోచుకోని న్యాయవివాదాలకు దారితీస్తుందన్నారు. ఇక ఈ కేసుపై తదుపరి వాదనలను మార్చి 24న వింటామని సుప్రీంకోర్టు బెంచ్ తెలిపింది.

## 11ఏళ్ల బాలుడి గుండెకు అతుక్కున్న క్యాన్సర్ కణితి- తొలగించి వరల్డ్ రికార్డ్ సృష్టించిన వైద్యులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందదని, అక్కడ సర్జరీలు కష్టమేనని చాలా మంది ప్రజలు అపోహ పడుతుంటారు. ఇదీ తప్పుడు ఆలోచన అని నిరూపించారు ఛత్తీస్‌గఢ్‌లోని డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్ మెమోరియల్ ఆస్పత్రి వైద్యులు. 11 ఏళ్ల బాలుడి గుండెకు ఆనుకుని ఉన్న అరుదైన క్యాన్సర్ కణితిని విజయవంతంగా తొలగించారు. ఈ క్రమంలో అత్యంత తక్కువ వయసున్న బాలుడికి ఈ తరహా చికిత్స చేసి ప్రపంచ రికార్డు సృష్టించారు. చంపాకు చెందిన ఆరో తరగతి విద్యార్థి సుమారు గత ఆరు నెలలుగా ఛాతీ నొప్పి, ఆయాసంతో బాధపడుతున్నాడు. రోగనిర్ధారణ పరీక్షల్లో అతని ఛాతీలో ఒక పెద్ద కణితి ఉన్నట్లు తేలింది. ఈ కణితి అతని గుండెకు, ప్రధాన ధమనులకు అతుక్కుని ఉన్నట్లు వైద్య పరీక్షల్లో వెల్లడైంది. ఈ క్రమంలో బాలుడి తల్లిదండ్రులు అనేక ఆస్పత్రులకు తీసుకెళ్లారు. అఖరికి డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్ మెమోరియల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడి వైద్యులు బాలుడికి సిటి స్కాన్ చేశారు. అప్పుడు ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కృష్ణకాంత్ సాహు బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి అతడి కుటుంబ సభ్యులకు వివరంగా చెప్పారు. ఈ శస్త్రచికిత్స అత్యంత ప్రమాదకరమైనదని, ఈ సర్జరీ సమయంలో రోగి ప్రాణానికి ప్రమాదం వాటిల్లే అవకాశం కూడా ఉంటుందన్నారు. ఈ ఆపరేషన్‌ను మధ్యలోనే ఆపేయాల్సి రావొచ్చని వెల్లడించారు. అయితే బాలుడి కుటుంబసభ్యులు సర్జరీకి అంగీకరించారు. ఆపరేషన్ సమయంలో ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే ఎదుర్కోవడానికి వీలుగా ఒక హార్ట్-లంగ్ మెషీన్‌ను వైద్యులు సిద్ధంగా ఉంచారు. బీఆర్ అంబేడ్కర్ ఆస్పత్రిలోని గుండె, ఛాతీ, రక్తనాళాల శస్త్రచికిత్స విభాగ అధిపతి డాక్టర్ కృష్ణకాంత్ సాహు నేతృత్వంలోని వైద్య బృందం సుమారు నాలుగు గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సర్జరీ సమయంలో రోగికి నాలుగు యూనిట్ల రక్తాన్ని ఎక్కించారు. శస్త్రచికిత్స అనంతరం కణితిని బయాప్సీ కోసం పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ రబియా పర్వీన్ సిద్ధిఖీ వద్దకు పంపారు. అప్పుడు రోగికి ఇన్వాసివ్ థైమిక్ కార్సినోమా (టైప్ బి థైమోమా, స్టేజ్ ఉందని తేలింది. ఆ తర్వాత ఆంకాలజీ విభాగం రోగికి 25 రేడియేషన్ థెరపీలను చేసింది. శస్త్రచికిత్స జరిగిన సుమారు ఆరు నెలల తర్వాత బాలుడు పూర్తిగా కోలుకున్నాడు. రెండు నెలల క్రితం తిరిగి పాఠశాలకు వెళ్లడం ప్రారంభించాడు. సర్జికల్ ఆంకాలజీపై జరిగిన జాతీయ సదస్సులో ఈ అరుదైన కేసు గురించి చర్చ జరిగింది. కాగా, స్టేజ్-3 ఇన్వాసివ్ థైమిక్ క్యాన్సర్‌కు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి వైద్యులు బాలుడికి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. గతంలో 12 ఏళ్ల బాలుడికి ఈ తరహా చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఆ రికార్డును డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్ మెమోరియల్ ఆస్పత్రి వైద్యులు బద్దలు కొట్టారు. 11 ఏళ్ల రోగికి ఇంత సంక్లిష్టమైన సర్జరీని విజయవంతంగా పూర్తి చేసి వరల్డ్ రికార్డు నెలకొల్పారు. ఈ శస్త్రచికిత్స వైద్య బృందం అంకితభావానికి, కఠోర శ్రమకు నిదర్శనంగా నిలిచింది. ఆరు నెలల క్రితం క్యాన్సర్ శస్త్రచికిత్స చేయించుకున్నాడు బాలుడు. అలాగే 25 రేడియేషన్ థెరపీలు చేయించుకున్నాడు. ఈ ప్రత్యేక రకమైన కణితి సాధారణంగా 40-60 సంవత్సరాల మధ్య వయసు గల వ్యక్తుల్లో కనిపిస్తుంది. వైద్య పరిభాషలో ఈ కణితిని ఇన్వాసివ్ థైమోమా అని పిలుస్తారని వెల్లడించారు. ఈ కణితి ఉండటం వల్ల వ్యాధి ఆ బాలుడి గుండెతో పాటు పెరికార్డియం, ఫ్రానిక్ నర్వ్, బృహద్ధమని, ప్రధాన పుపుస ధమని, ఎడమ కర్ణిక, ఊపిరితిత్తులను కూడా చుట్టుముట్టింది. పిల్లలలో ఇటువంటి కణితి ఏర్పడటం చాలా అరుదు. ఇటువంటి సందర్భాల్లో కణితిని పూర్తిగా తొలగించడం చాలా కష్టం. అయితే అంబేడ్కర్ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న హార్ట్- లంగ్ మెషీన్ సహాయంతో ఈ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. కణితి పరిమాణం చాలా పెద్దదిగా ఉండటం వల్ల అది శరీరంలోని అనేక అవయవాలకు అతుక్కుని ఉంది. దానిని తొలగించడానికి ద్వంద్వ విధానం (డ్యూయల్ అప్రోచ్) అనే పద్ధతిని ఉపయోగించారు. ఈ పద్ధతిలో రోగి శరీరంపై రెండు వేర్వేరు ప్రదేశాలలో ఛాతీ ఎముక, పక్కటెముకల వద్ద కోత పెట్టారు. వైద్యపరంగా ఈ ప్రక్రియలను వరుసగా స్టెర్నోటమీ, థొరాకోటమీ అని పిలుస్తారు.

# ఫామ్‌హౌసుల్లో 'చీకటి వ్యవహారాలు

-మొదటిపేజీ తరువాయి

చేస్తున్నారు. దీంతో వీటిని అనుమతులు లేకున్నా అధికారులూ చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. రంగారెడ్డి, సంగారెడ్డి, నల్గొండ, వికారాబాద్?, మహబూబ్?నగర్? జిల్లాలకు చెందిన కొందరు నేతలూ వీటికి యజమానులే. వీటిని ఇతరులకు లీజుకు ఇచ్చారు. సొంతంగా పార్టీలు ఏర్పాటు చేసుకున్నప్పుడు లీజుదారులకు ఫోన్? చేసి ఆ రోజు ఎవరికీ కిరాయికి ఇవ్వొద్దంటూ ఆదేశిస్తున్నారు. పార్టీలకు తమ సన్నిహితులు, స్నేహితులను ఆహ్వానిస్తున్నారు. రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజామున నాలుగు వరకు ఈ పార్టీలు కొనసాగుతున్నాయి.

**నిబంధనలు గాలికి**

వ్యవసాయ భూముల్లో ఫామ్?హౌస్?ను కట్టుకోవాలంటే అనేక నిబంధనలు ఉన్నాయి. వీటిని అనుసరించి తొలుత పంట భూములను వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. సంబంధిత గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ నుంచి అనుమతులు పొందాలి. 300 మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉంటే హెచ్?ఎండీఏ నుంచి అనుమతి తీసుకోవాలి. అయితే ఇందుకు విరుద్ధంగా రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నిర్మాణాలు జరుపుతున్నారు. మరోవైపు వీటిపై రూ.లక్షల్లో కిరాయి వస్తుంది. దీంతో వ్యవసాయ భూములున్న కొందరు ఈ నిబంధనలను పట్టించుకోకుండా వాటిలోనే నిర్మాణాలు చేస్తున్నారు. అధికారులకు ఈ విషయం తెలిసినా, చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తాఖీదులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు.

**ఫామ్‌హౌస్‌లపైనే ప్రత్యేక దృష్టి**

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్?నగర్?లోని ఫామ్‌హౌస్ ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించింది. దీనిని దృష్టిలో ఉంచుకుని రాజధాని నగరానికి ఆనుకొని ఉన్న ఫామ్‌హౌస్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టింది. పైలట్ రోహిత్ రెడ్డి సోదరుడు శనివారం మొయినాబాద్? మండలం అజీజ్ నగర్‌లోని ఫామ్‌హౌస్‌లో తన స్నేహితులను పార్టీకి ఆహ్వానించారు. ఈ పార్టీలో అతనితో పాటు మరో 10 మంది పాల్గొన్నారు. ఈ విషయం మొయినాబాద్? పోలీసులకు తెలిసింది. వారు సోదాలు నిర్వహించేందుకు ఆ ప్రాంతానికి చేరుకోగా పేలుళ్ల శబ్దం వినిపించింది. దీంతో అప్రమత్తమయిన పోలీసులు కాల్పులు జరిపిన వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నారు. అతని నుంచి తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఈ పార్టీలో డ్రగ్స్ వినియోగించారనే అనుమానంతో అక్కడున్న 11 మందినీ పరీక్షించగా వారిలో ఆరుగురికి పాజిటివ్? వచ్చింది.

# 'ఫామ్‌హౌస్' ఘటనతో అప్రమత్తం

పోటీ ప్రపంచంలో నెగ్గేందుకు పరుగులు, ముందుకెళ్లే క్రమంలో ఎదురయ్యే ఆటుపోట్లు, జీవితాన్ని ఆస్వాదించాలనే ఆలోచనలు, కొత్త కొత్త పరిచయాలు, కారణాలేవైనా వయో బేధం లేకుండా సినీ, బుల్లి తెర, రాజకీయ ప్రముఖులు మత్తుకు దగ్గరవుతున్నారు. డ్రగ్స్‌ను కొనేటప్పుడు, వాడేటప్పుడు ఎక్కడా తమ ఆనవాళ్లు దొరక్కుండా జాగ్రత్త పడుతున్నారు. మొయినాబాద్‌లోని రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో జరిగిన ఘటనతో మత్తుప్రియులతో పాటు పెడ్లర్లు అప్రమత్తమైనట్లు పోలీసులు గుర్తించారు.

**డ్రగ్స్ సరఫరా ముఠాలపై పోలీసుల నిఘా**

మత్తు పదార్థాల సరఫరా కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న ఓ పెడ్లర్ ఫోన్‌లో కొందరు సినీ, బుల్లితెర నటుల ఫోన్ నెంబర్లున్నాయి. వారితో అతడు సన్నిహితంగా దిగిన ఫొటోలు కనిపించాయి. వారితో ఎలా పరిచయమని ప్రశ్నిస్తే కస్టమర్స్ అంటూ సమాధానమిచ్చాడు. బెంగళూరు నుంచి సరకు తీసుకొచ్చి ఏజెంట్ ద్వారా చేరవేస్తామని నిందితుడు చెప్పాడు. కానీ వారంతా మాదకద్రవ్యాలు కొనుగోలు చేసినట్టు, వాడినట్టు ఎక్కడా ఆధారాలు లభించలేదు. దీంతో ఏమీ చేయలేని పరిస్థితి అంటూ ఒక ఇన్?స్పెక్టర్ తన అనుభవాన్ని పంచుకున్నారు. సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నామనే విచక్షణ మరచి తప్పటడుగులు వేస్తున్నారని, పలుకుబడితో కేసు నుంచి బయటపడగలమనే ధీమాతో విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని పోలీసు ఉన్నతాధికారి ఆందోళన వ్యక్తం చేయటం పరిస్థితికి అద్దం పడుతోంది. ఇటీవల మొయినాబాద్ అజీజ్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఫామ్?హౌస్ డ్రగ్స్, మద్యం పార్టీ నేపథ్యంలో ఈగల్ బృందం దాడి చేసింది. ఆ దాడితో ఫామ్ హౌస్?లు, పబ్బుల్లో మత్తు పార్టీలకు వెళ్తున్న వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అప్రమత్తమైనట్టు తెలిసింది. డ్రగ్స్ సరఫరా ముఠాలపై పోలీసు నిఘా పెరిగిందనే సమాచారంతో కొందరు ఫోన్లు సైతం స్విచ్ఛాఫ్ చేసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం.

పనిచేసే వారిని పావులుగా వాడుకుంటూ : పోలీసులకు పట్టుబడిన నైజీరియన్లు, అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్స్‌లో ప్రముఖుల నివాసాలు, కార్యాలయాల్లో వాచ్‌మెన్, సహాయకుల ఫోన్ నెంబర్లు బయటపడుతున్నాయి. వీరంతా నెల సంపాదనను ఒక్క డోసు కోసం ఎందుకు ఖర్చు పెడుతున్నారని పోలీసులు ఆరా తీస్తే కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. తమ ఆనవాళ్లు బయటపడకుండా ఉండేందుకే తమ వద్ద పని చేసే వారిని ప్రముఖులు పావులుగా ఉపయోగించుకుంటున్నారని తేలింది. ప్రత్యేక సందర్భాలు, వీకెండ్ పార్టీలు, వ్యక్తిగత వినియోగానికి కావాల్సిన డ్రగ్స్ కోసం ముంబై, బెంగళూరు, గోవాల్లోని ప్రధాన పెడ్లర్స్‌కు సమాచారమిస్తున్నారు. వారి నుంచి సబ్?పెడ్లర్స్, కొరియర్ ద్వారా వీరికి అందుతున్నాయి. ఆ లావాదేవీలకు ప్రముఖులు తమ వద్ద పని చేసే వారి ఫోన్ నెంబర్లు, యూపీఐ ఖాతాలు ఉపయోగిస్తున్నారు. ఆ పార్సిల్ ఎవరి కోసం రప్పించారనే వివరాలు గోప్యంగా ఉంచుతున్నారు. వాటిలో మత్తు పదార్థాలున్నట్టు అధిక శాతం మంది పనివాళ్లకు కనీసం తెలియదని ఓ పోలీసు అధికారి తెలిపారు.

**డ్రగ్ పెడ్లర్ వద్ద బుల్లితెర నటుల నెంబర్లు**

ఇటీవల పోలీసులు డిపోర్టేషన్ చేసిన నైజీరియన్ వద్ద స్థిరాస్తి, ఐటీ, ఫార్మా కంపెనీల యజమానుల ఫోన్ నెంబర్లను గుర్తించారు. వాటిని సంప్రదించేందుకు ప్రయత్నిస్తే స్విచ్ఛాఫ్? వస్తున్నాయి. వాటిపై తమ సంస్థ పేరుతో అక్కడ పని చేసే ఉద్యోగులకు ఆ సిమ్‌లు కేటాయించామని ఒక ఫార్మా యజమాని స్పందించినట్టు తెలిసింది. పాతబస్తీకి చెందిన ఒక డ్రగ్ పెడ్లర్ వద్ద బుల్లితెర నటీనటుల ఫోన్ నెంబర్లు గుర్తించారు. వారికి నేరుగా మత్తు పదార్థాలు ఇవ్వలేదని, వారి వద్ద పని చేసే సహాయకులకు పార్సిల్ ఇస్తుంటామని విచారణలో అంగీకరించినట్టు సమాచారం.

మత్తు పదార్థాల కట్టడిలో కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం ఆదేశించటంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. డ్రగ్స్ స్మగర్లు, పెడ్లర్ల ఫోన్లలో లభించే నెంబర్లు, వివరాల ఆధారంగా జాబితా సిద్ధం చేస్తున్నారు. చిట్టాలోని కొనుగోలుదారులకు నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. గతంలో మత్తు పదార్థాలు ఉపయోగించి పట్టుబడిన వారిపై తాజాగా నిఘా పెంచారు. వారి కదలికలు, ప్రైవేటు పార్టీల నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

# మూసీ తొలి దశ డీపీఆర్ సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

కొనసాగుతోందని వెల్లడించారు. మూసీపై చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య వాదోపవాదాలు సాగాయి. బఫర్‌జోన్‌లో ఉన్న వారికి టీడీఆర్ ఇస్తామని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం కల్పిస్తామని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టుపై అసెంబ్లీలో వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని, దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని బీఆర్ఎస్ తెలిపింది. ప్రజల జీవితాలు బాగు పరచాలన్న సంకల్పంతో ఒక యజ్ఞంలా దీనిని చేపడుతున్నామని, ప్రతి దానికీ అడ్డుపడటం తగదని ప్రభుత్వం స్పష్టం చేసింది. బీఆర్ఎస్ తన వైఖరి మార్చుకోవాలని, సభలో పూర్తి స్థాయి చర్చకు సిద్ధమని ప్రకటించింది. ప్రభుత్వ సమాధానాలపై బీఆర్ఎస్ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.

"బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులు చిన్న వరదకే కొట్టుకుపోయాయి. మురికి కాలువగా ఉన్న జీవనది మూసీని అభివృద్ధి చేయడం తప్పా? మూసీ అభివృద్ధికి ఎందుకు అడ్డుపడుతున్నారు. మూసీ ప్రాజెక్టు తొలి దశ డీపీఆర్ తయారైంది. తొలి దశ డీపీఆర్ రూ.6,500 నుంచి రూ.7000 కోట్లుగా అంచనా వేశాం. తుది ఎన్యూమరేషన్ కొనసాగుతుంది. బఫర్‌జోన్‌లో ఉన్నవారికి టీడీఆర్ ఇస్తాం"– శ్రీధర్?బాబు, మంత్రి

**ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు**

అనంతరం బీఆర్ఎస్? కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్? మాట్లాడుతూ జనవరిలో డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని చెప్పి, ఇప్పుడు త్వరగా పూర్తి చేశారంటే ఎలా అని ప్రశ్నించారు. పాకిస్థాన్?లో నిషేధిత సంస్థకు ప్రాజెక్టు అప్పగించారని ఆరోపించారు. ఏడీబీ రుణంపై కూడా ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని అన్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం విషయంలో కూడా స్పష్టత లేదని, దశలు, ఎన్ని ఇళ్లు కూలుస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రక్షాళనకు తమకు వ్యతిరేకత లేదని, కానీ పేదల ఇళ్లు కూల్చకుండా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. కేసీఆర్ హయాంలో ఇదే విధానాన్ని అనుసరించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలపై కక్షతో వ్యవహరిస్తోందని విమర్శించారు.

**మూసీని జీవనదిగా మార్చడమే లక్ష్యం**

మూసీ కోసం బీఆర్ఎస్ హయాంలో ప్రణాళికలు రూపొందించి, ఇప్పుడు పేదలను రెచ్చగొట్టడం సరికాదని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.30 కోట్లతో చేసిన ట్రాక్ దెబ్బతిందని అన్నారు. డీపీఆర్ తయారీ 2025 జనవరిలో ప్రారంభమై, 2026 ఫిబ్రవరిలో పూర్తయిందని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2016లో ఇచ్చిన 50 మీటర్ల బఫర్ జోన్ జీవో ప్రకారమే ముందుకెళ్తున్నామని తెలిపారు. ఏడీబీ రుణంపై త్వరలో స్పష్టత వస్తుందని, అవసరమైతే ప్రపంచ బ్యాంకు లేదా ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. మూసీని జీవనదిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే సంకల్పమని మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.

**సభ నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్**

మూసీ తీర ప్రాంత పేదల జీవన పరిస్థితులను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి భట్టి చెప్పారు. అదే ప్రాంతంలో అపార్ట్‌మెంట్లు కట్టి ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తుంటే, ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. డీపీఆర్ ఉంటే సభలో ఉంచాలని డిమాండ్ చేసిన కేటీఆర్ మూసీ ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని, కానీ భారీ అవినీతికి వ్యతిరేకమని అన్నారు. ఫైవ్ స్టార్ హోటల్ లో కాదు మూసీ బాధితుల, ప్రజల సమక్షంలో ప్రజెంటేషన్ పెట్టాలని మేము తాజ్ కృష్ణా కార్యక్రమానికి రాలేదని చెప్పారు. డిప్యూటీ సీఎం పేదలపై ప్రేమ వలకబోస్తున్నారని వెలుగుమట్లలో పేదల ఇండ్లు కూల్చారని ఆక్షేపించారు. మూసీని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. మంత్రి సరైన సమాధానాలు ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

# ట్రాక్టర్ల యజమానుల కష్టాలు ఇంతింత కాదయా

**ఖమ్మం :** జీవనాధారం కోసం అప్పులు చేసి ట్రాక్టర్లు కొనుగోలు చేసిన అనేక మంది యజమానుల పరిస్థితి అశ్వాపురం మండలంలో రోజురోజుకు కష్టాల్లోకి జారుతోంది. కుటుంబాలకు ఆదాయం వస్తుందనే ఆశతో ఫైనాన్స్ కంపెనీల నుంచి అప్పులు తీసుకుని ట్రాక్టర్లు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు పనులు లేక ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. చింతిర్యాల, గొల్లగూడెం, చింతిర్యాల కాలనీ, ఆనందపురం, సీతారామపురం పంచాయతీల పరిసర ప్రాంతాల్లోని ట్రాక్టర్లు గత కొన్ని నెలలుగా సరైన తోలకాలు లేక ఇండ్ల వద్దే నిలిచిపోయాయి. చేతిలో పని లేకపోవడంతో ఫైనాన్స్ కిస్తీలు చెల్లించడం యజమానులకు భారంగా మారింది. కొంతమంది ఎలాగోలా అప్పులు చేసి కిస్తీలు కడుతుండగా, మరికొందరు కుటుంబ పోషణ కూడా కష్టమై ట్రాక్టర్లను ఫైనాన్స్ సంస్థలకు అప్పగించాల్సిన పరిస్థితికి చేరుకుంటున్నారు. జీవనోపాధి కోసం కొనుగోలు చేసిన వాహనాలే ఇప్పుడు వారి భుజాలపై భారంగా మారుతున్నాయని ట్రాక్టర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొన్ని పంచాయతీలు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని కొందరు సాధారణ ట్రాక్టర్ యజమానులు గోదావరి నుంచి సహజంగా ఏర్పడిన ఇసుకను మండల ప్రజల అవసరాలకు సరఫరా చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే వారు ఈ పని



చేసేది కోట్లు సంపాదించేందుకు కాదు. కేవలం కుటుంబాలను పోషించుకునేందుకు మాత్రమే ఈ వృత్తిని కొనసాగిస్తున్నామని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లో ట్రాక్టర్లు నడిపే వారి జీవన పరిస్థితులను పరిశీలిస్తే వారి ఆర్థిక స్థితి ఎంత కష్టాల్లో ఉందో స్పష్టమవుతుంది. గోదావరి నుంచి అరకొర ఇసుకను తోలుకుంటూ జీవనం సాగిస్తున్న కొందరికి కనీసం నివసించేందుకు సరైన ఇల్లు కూడా లేకపోవడం స్థానికులు చెబుతున్న వాస్తవం. సమాజంలో ఎవరికీ భారంగా కాకుండా స్వయంగా కష్టపడి జీవించాలనే ఉద్దేశంతోనే ఈ ట్రాక్టర్ యజమానులు తమ వాహనాలను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొన్ని శాఖల అధికారులు వారి పరిస్థితిని గమనించి సహకరించాలని భావించినప్పటికీ, సామాజిక మాధ్యమాలు మరియు సోషల్ మీడియా ప్రభావంతో ప్రతి చర్యపై విమర్శలు రావడంతో అధికారులు కూడా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన పరిస్థితి నెలకొంది. ట్రాక్టర్ యజమానుల జీవన స్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సమగ్రంగా పరిస్థితిని పరిశీలించి వారికి ఉపశమనం కలిగించే చర్యలు తీసుకుంటే అనేక కుటుంబాలకు ఊరట లభించే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక ట్రాక్టర్ యజమాని వెన్న అశోక్ కుమార్ మాటల్లో.. పొట్ట నింపుకోవడానికే కొనుకున్న ట్రాక్టర్ఈ ఇప్పుడు అదే జీవన భారంగా మారింది. అశ్వాపురం మండలంలో చింతిర్యాల గోదావరి నది ఒడ్డు నుంచి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం ట్రాక్టర్ల ద్వారా ఇసుక సరఫరా జరుగుతోంది. కానీ మరికొన్ని పంచాయతీలలో గోదావరి ఒడ్డు నుంచి లారీల ద్వారా అక్రమంగా ఇతర ప్రాంతాలకు ఇసుక తరలింపులు జరుగుతున్నాయి.

## ముంచుకొస్తున్న ఏఐ సంక్షోభం

-మొదటిపేజీ తరువాయి

మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతుందనుకున్నానని, కానీ వారు నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆక్షేపించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చపై ఆయన అసెంబ్లీలో సమాధానమిచ్చారు. విపక్ష నేత సమయం, సందర్భం లేకుండా నచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకార ధోరణి, అధికారం పీకేసినా అదే అహంకారంతో వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. నూతన గవర్నర్‌ను కలవడానికి ప్రతిపక్ష నేత కేసీఆర్ వస్తారనుకున్నామని, రాకపోగా సభ సాంప్రదాయాలను గౌరవించకపోడం తెలంగాణ సంస్కృతికి పూర్తి విరుద్ధం అని అసహనం వ్యక్తం చేశారు. ఏఐ ద్వారా లక్షలాది ఉద్యోగాలు పోయి నిరుద్యోగ సమస్య తలెత్తే పరిస్థితి ఏర్పడిందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి పరిష్కారంగా విజన్ డాక్యుమెంట్‌ను సభలో ప్రవేశపెట్టామని తెలిపారు.

**ఎవరు కలిసివచ్చినా రాకపోయినా సరే**

ప్రభుత్వం చేపట్టిన ఏ ప్రణాళికలోనైనా రాజకీయం, స్వార్థం, అధికారం కోల్పోయామనే బాధనే విపక్షాల మాటల్లో కనిపిస్తోందని ఆరోపించారు. ఎవరు కలిసి వచ్చినా.. రాకపోయినా తమ ప్రభుత్వం ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ 2047లో తెలంగాణను మూడు భాగాలుగా విభజించామని తెలిపారు. ప్రస్తుతం పెట్టుబడిదారులు ఎక్కువగా హైదరాబాద్ వైపు చూస్తున్నారని, అందుకు తగ్గట్టుగానే అభివృద్ధి ప్రణాళికలు రూపొందించినట్లు అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించారు. హైదరాబాద్ అర్బన్ ప్రాంతం క్యూర్‌ను ప్రక్షాళన చేసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై నగరాల్లోని పరిస్థితులు మనకు కనువిప్పు కావాలన్నారు. ముందుచూపులో భాగంగానే హైదరాబాద్‌లో చెరువులను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. చెరువులను కబ్జాల చెర నుంచి విడిపించి పునరుజ్జీవనం చేస్తున్నామని, బతుకమ్మకుంట, నల్లచెరువు, బుమ్‌రుఖ్‌ఉద్దౌలా చెరువులను పునరుద్ధరించామని ప్రకటించారు.

**మీ కార్యాచరణనే అమలు చేస్తున్నాం**

హైదరాబాద్‌లో నాలాలపై 28 వేల అక్రమ కట్టడాలు ఉన్నాయని గతంలో కేసీఆర్ ప్రకటించారని ముఖ్యమంత్రి తెలిపారు. నాలాలపై నిర్మాణాలను నిర్దాక్షిణ్యంగా కూల్చాలని గతంలో కేటీఆర్ ఆదేశాలు ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కార్యాచరణనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. గతంలో వాళ్లు చెప్పిన మాటలనే ఇవాళ తప్పుపడుతూ దుష్ప్రచారం చేస్తున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. బీజేపీ నేతలు సబర్మతి, గంగానది, యమున ప్రాజెక్టులను సమర్థించి మూసీ ప్రాజెక్టును ఎందుకు తప్పుపడుతున్నారని సీఎం ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ముంపు, కాలుష్యం సమస్యను పరిష్కరించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. అందులో భాగంగానే భారీ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

## పేద ప్రజలకు ఇళ్లు ఇవ్వడమే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో అవకవతవకలు జరుగుతున్నాయని కలెక్టరేట్ల ముందు అర్హులు ధర్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమాధానమిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్నికల హామీ కాదని, ప్రజా పాలనలో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 3,24,593 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు.

"ఈ మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్లు నిర్మాణం పూర్తి కానున్నాయి. జూన్?, జులై నాటిని ఏవైతే మొదటి విడత ఇచ్చిన మూడు లక్షల ఇళ్లు ఉన్నాయో వాటిలో మెజార్టీ ఇళ్లు పూర్తి కాబోతున్నాయి. వందకి వంద శాతం ఎన్నికల ప్రామిస్?లు కావని, ఇది ప్రజా ప్రభుత్వం ప్రామీసులు. తప్పకుండా పట్టణ ప్రాంతంలో రాబోయే మూడు సంవత్సరాల్లో ప్రతి వార్డులో అర్హులైన పేద వాళ్లకి తప్పకుండా ఇందిరమ్మ ఇళు ఇచ్చి తీరుతాం" – పొంగులేటి శ్రీనివాస రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి

**త్వరలో డిజిటల్ మీడియా పాలసీ**

ప్రస్తుతం ప్రింట్ మీడియాను చదివేవారు, ఎలక్ట్రానిక్ మీడియాను చూసే వాళ్లు చాలా తగ్గిపోయారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయంగా డిజిటల్ మీడియా వైపు వెళుతున్నారు అని అన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా? అని ఆయన ప్రశ్నించారు. వచ్చే రెండు, మూడు నెలల్లో డిజిటల్ మీడియా పాలసీని తీసుకు రానున్నామని పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యలపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు.

**జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు జారీ**

డెస్క్, ఫీల్డ్ జర్నలిస్టులను వేరు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. నిజమైన జర్నలిస్టులకే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నది తమ లక్ష్యం అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. న్యాయపరమైన వివాదాలు లేకుండా పాత్రికేయులకు ఇళ్ల స్థలాల పంపిణీకి యోచిస్తున్నట్లు చెప్పారు. వర్కింగ్ మరణించిన వర్కింగ్ జర్నలిస్టల కుటుంబాలకు ప్రభుత్వం లక్ష రూపాయలు అందిస్తుందని వివరించారు.

"మరణించిన, వర్కింగ్ జరల్నిస్టుల కుటుంబాలకు మొత్తం లక్ష రూపాయలు అందిస్తుంది. 671 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఇవ్వడం జరిగింది. జూన్? 27, 2016 తేదీ గల జోవో నెంబర్? జీఎస్? శాఖ 225 ప్రకారం మరణించిన వర్కింగ్? జర్నలిస్టుల కుటుంబాలకు ఫించన్?, వారి పిల్లలకు ట్యూషన్? ఫీజు, శ్వాశత అంగవైకల్యానికి అయిన వారికి ఆర్థిక సాయాన్ని అందించడం జరుగుతుంది" – పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సమాచార శాఖ మంత్రి

## రాత్రిపూట యాడ్లపై జరాభద్రం

**హైదరాబాద్ :** అమాయక ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు రకరకాల పన్నాగాలు పన్నుతున్నారు. టెక్నాలజీ పెరిగిన కొద్దీ అప్‌గ్రేడ్ అవుతూ.. సరికొత్త పద్ధతుల్లో మోసాలు చేస్తున్నారు. ఇక పెళ్లి కాని యువకులు, మహిళల బలహీనత ఉన్న వారే టార్గెట్‌గా ప్రస్తుతం సైబర్ కేటుగేళ్లు కొత్త కొత్త మార్గాల్లో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. మహిళల పేరుతో వల వేసి.. దొరికిన కాడికి దోచుకుంటున్నారు. ఒంటరిగా ఉండే యువకులే లక్ష్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)సాయంతో మహిళలు మాట్లాడుతున్నట్లుగా వీడియోలు విడుదల చేసి.. పురుషులను బుట్టలో పడేసి డబ్బులు దండుకుంటున్నారు. ఇలాంటి మోసాల పట్ల హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలోనే గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న యాడ్ మోసాలపై సజ్జనార్ క్లారిటీ ఇచ్చారు. యాప్‌లు ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఊరించి.. అకౌంట్లు ఖాళీ చేస్తారని హెచ్చరించారు. ఈ సందర్భంగా సజ్జనార్ ఎక్స్ వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'ఒంటరిగా ఉన్నారా? ఇంకెందుకు ఆలస్యం.. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి. అందమైన అమ్మాయిలు, ఆంటీలతో సరదాగా మాట్లాడండి. మీ రంగు, రూపంతో మాకు పనిలేదు." అంటూ సోషల్ మీడియాలో ఇబ్బడిముబ్బడిగా కనిపిస్తున్న ఈ యాడ్స్ వెనుక ఉన్నది తీయటి మాటలు కాదు.. నిలువునా దోచేసే సైబర్ కేటుగాళ్ల ఉచ్చు. యువత ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకుని నేరగాళ్లు పన్నుతున్న హనీట్రాప్ ఇది. ఈ వీడియోల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్న అమ్మాయిలు నిజం కాదు. అవన్నీ ఏఐ సాయంతో సృష్టించిన వీడియోలు. మాయమాటలకు బుట్టలో పడి వారు సూచించిన యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుంటే ముప్పు కొనితెచ్చుకున్నట్లే. ఆ లింక్ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే, మీ ఫోన్‌లోని కాంటాక్ట్స్, గ్యాలరీ మొత్తం వారి అధీనంలోకి వెళ్లిపోతాయిఇక రాత్రిపూట సరదాగా మాట్లాడుదమని వీడియో కాల్ చేస్తే.. అవతలి వైపు న్యూడ్ వీడియోలు ప్లే చేసి, స్క్రీన్‌పై ఉన్న మీ ముఖాన్ని రికార్డ్ చేస్తారు. ఆ తర్వాత దాన్ని మార్ఫింగ్ చేసి, మీ కాంటాక్ట్ లిస్ట్‌లోని బంధుమిత్రులకు పంపుతామంటూ బ్లాక్‌మెయిలింగ్ సెక్స్‌టార్షన్ కు దిగుతారు. పరువు పోతుందన్న భయంతో వారు అడిగినంత ఇచ్చుకుంటూ పోతే మీ బ్యాంకు ఖాతాలు ఖాళీ అవ్వడం ఖాయం. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి మోసపూరిత ప్రకటనలు ఇస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్‌లో ఎవరూ మీకు ఊరికే స్నేహితులు కారు.. ఆ ఆకర్షణ వెనుక మీ డబ్బు, పరువు

# పెద్దపల్లి కార్మిక సంక్షేమ అధికారిపై ఫిర్యాదు

**లేబర్లకు న్యాయం చేయాలి**
**పెద్దపల్లి లేబర్ అధికారిపై ఆరోపణలు**
**కమీషనర్‌కు వినతిపత్రం**
**హేమలత బదిలీ చేయాలని డిమాండ్**
**లేబర్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బొంకూరి కైలాసం.**



**అగ్నిధారన్యూస్,( పెద్దపల్లి// హైదరాబాద్):**

పెద్దపల్లి జిల్లా భవన నిర్మాణ కార్మికులకు న్యాయం జరుగడం లేదని, లేబర్ అధికారిపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్ లోని టంగుటూరి అంజయ్య కార్మిక సంక్షేమ భవనంలో తెలంగాణ రాష్ట్ర లేబర్ కమిషనర్ పమేలా సత్పతికి కార్మికుల తరఫున వినతిపత్రం సమర్పించారు. దళిత బహుజన లేబర్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బొంకూరి కైలాసం ఆధ్వర్యంలో సమర్పించిన ఈ వినతిలో, పెద్దపల్లి లేబర్ ఆఫీసర్ హేమలతపై పలు ఆరోపణలు చేశారు. ప్రభుత్వం నుంచి కార్మికులకు అందాల్సిన ఆర్థిక సహాయాన్ని అడ్డుకుంటున్నారని, భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన బెనిఫిట్ బిల్లులను వరుసగా తిరస్కరిస్తూ అనవసరంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి మార్పు కనిపించలేదని, అధికారులు మందలించినా పరిస్థితి మారలేదని కార్మికులు వాపోయారు. కార్మికుల తరఫున మాట్లాడిన వారిపై మంథని ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు సహా పలు తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. దీంతో కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయని తెలిపారు. కార్మికులకు రావాల్సిన హక్కులు, ప్రయోజనాలు అందకుండా అడ్డంకులు సృష్టిస్తున్న లేబర్ ఆఫీసర్ హేమలతను తక్షణమే బదిలీ చేసి, కార్మికులకు న్యాయం చేయాలని బొంకూరి కైలాసం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవత వెలుగు అవార్డు గ్రహీత దార మధు పాల్గొన్నారు.

# బురదమయం.. నరకప్రాయం..


**వానొస్తే కాజిపల్లి గల్లీలు అగమ్యగోచరం**
**స్కూలుకెళ్లలేక చిన్నారుల అవస్థలు**
**బైకులు కూడా వెళ్లలేని వైనం**
**పట్టించుకోని పాలకులు..**
**కనీసం మట్టి కూడా పోయలేదని ఆవేదన**

**అగ్నిధార న్యూస్, (రామగుండం):**

అది రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్ కాజిపల్లి గ్రామం. నగరం నడిబొడ్డున ఉన్నా ఆ గల్లీ పరిస్థితి చూస్తుంటే ఏదో మారుమూల అడవిని తలపిస్తోంది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు.. ఆ రోడ్డంతా బురద కుంటగా మారిపోతోంది. వాహనాలు వెళ్లడం దేవుడెరుగు.. కనీసం మనిషి నడిచే పరిస్థితి కూడా లేకపోవడంతో స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు.


గోడ పట్టుకుని నడవాల్సిందే..:తాజాగా కురిసిన వర్షానికి రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. ముఖ్యంగా బడికి వెళ్లే చిన్నారుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. బురదలో కాలు పెడితే జారి పడతామనే భయంతో, పాఠశాల విద్యార్థులు ప్రహరీ గోడలను పట్టుకుని సర్కస్ ఫీట్లు చేస్తూ వెళ్లాల్సి వస్తోంది. తెల్లని దుస్తులు బురదలో తడిసిపోతుండటంతో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బైకులపై వెళ్లేవారు తరచూ కిందపడి గాయాలపాలవుతున్నారు.

పట్టించుకోని కార్పొరేషన్ యంత్రాంగం:ఏళ్లు గడుస్తున్నా తమ గల్లీలో రోడ్డు వేయడం లేదని, కనీసం వర్షాకాలంలోనైనా బురద లేకుండా మట్టి పోయాలని కోరినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "మా బాధ అర్థం చేసుకోండి అన్నా.. వెంటనే రోడ్డు వేయించి పుణ్యం కట్టుకోండి" అంటూ అధికారులను వేడుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన కాజిపల్లిలోని ఈ గల్లీలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**నేటి నుంచే ఒకటో తరగతికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం**
**బాలవాటిక 1, 3 తరగతులకు కూడా దరఖాస్తుల ఆహ్వానం ఏప్రిల్ 2 దరఖాస్తులకు ఆఖరి గడువు.**




**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతి బాలవాటిక తరగతుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు కేంద్ర విద్యాలయ సంఘటన్ సమగ్ర షెడ్యూల్‌ను ప్రకటించింది. రేపటి నుంచి (మార్చి 20) ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది.

**ముఖ్యమైన తేదీలు ఇవే:**

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: మార్చి 20, 2026 (శుక్రవారం) ఉదయం 10 గంటల నుంచి. దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 02, 2026 (గురువారం) సాయంత్రం వరకు. మొదటి జాబితా విడుదల: ఏప్రిల్ 08 (బాలవాటిక), ఏప్రిల్ 09 (ఒకటో తరగతి). రెండో, మూడో జాబితా: వరుసగా ఏప్రిల్ 16 మరియు ఏప్రిల్ 21 తేదీల్లో (సీట్లు ఖాళీగా ఉన్న పక్షంలో) ప్రకటిస్తారు.

**వయోపరిమితి నిబంధనలు:**

ప్రవేశం కోరే విద్యార్థులకు 2026 మార్చి 31 నాటికి ఈ క్రింది విధంగా వయస్సు ఉండాలి: ఒకటో తరగతి: 6 ఏళ్లు నిండి ఉండాలి (8 ఏళ్ల లోపు). బాలవాటిక-1: 3 ఏళ్లు నిండి ఉండాలి. బాలవాటిక-2: 4 ఏళ్లు నిండి ఉండాలి.

బాలవాటిక-3: 5 ఏళ్లు నిండి ఉండాలి. (గమనిక: ఏప్రిల్ 1వ తేదీన జన్మించిన పిల్లలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు).

**ఆఫ్‌లైన్ ప్రవేశాలు:**

రెండో తరగతి నుంచి ఆపై తరగతులకు (11వ తరగతి మినహా) ఖాళీలను బట్టి ఏప్రిల్ 02 నుంచి ఏప్రిల్ 08 వరకు ఆఫ్‌లైన్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. వీటికి సంబంధించిన జాబితాను ఏప్రిల్ 13న విడుదల చేస్తారు.

దరఖాస్తు విధానం: ఆసక్తి గల తల్లిదండ్రులు కేంద్రీయ విద్యాలయ అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను సంబంధిత పాఠశాల నోటీసు బోర్డుతో పాటు వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచుతారు.

## అమృత్ మిత్రగా గుర్తింపు పొందిన అనితకు అభినందనలు



**మేయర్ మహంకాళి స్వామి, కమిషనర్ అరుణ శ్రీ ప్రశంసలు**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

దేశ రాజధాని న్యూ ఢిల్లీలో నిర్వహించిన అమృత్ మిత్ర మహోత్సవ్‌లో పాల్గొన్న రామగుండం నగర పాలక సంస్థ ప్రతినిధి బూర్గుల అనితను మేయర్ మహంకాళి స్వామి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె. అరుణ శ్రీ అభినందించారు. 49వ డివిజన్ మార్గదర్శి స్లమ్ సమాఖ్యలో భాగమైన శ్రీ సరస్వతి మహిళా పొదుపు సంఘం సభ్యురాలు బూర్గుల అనిత అమృత్ మిత్రగా ఎంపికై దుర్గానగర్ అమృత్ పార్క్‌లో సేవలు అందిస్తున్నారు. ఈ నెల 13న న్యూ ఢిల్లీలోని భారత మండపంలో నిర్వహించిన అమృత్ మిత్ర మహోత్సవ్‌కు తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి ఐదుగురిని ఎంపిక చేయగా, అందులో రామగుండం నుంచి అనితకు అవకాశం లభించింది. మహోత్సవంలో పాల్గొని తిరిగి వచ్చిన అనంతరం అనిత బుధవారం మేయర్, కమిషనర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించిన వారు, ఇతర మహిళలకు ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. మహిళలు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని ఉపాధి అవకాశాలను పొందుతూ ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఆసక్తి ఉన్న మహిళలను అమృత్ మిత్రలుగా ఎంపిక చేసి ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు.

## ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి



**జిడికే 11వ ఇంక్లైన్ గని మేనేజర్‌కు ఏఐటియుసి వినతి**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని జిడికే 11వ ఇంక్లైన్ గనిలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ ఏఐటియుసి నాయకులు గని మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ నాయిని శంకర్ ఆధ్వర్యంలో బుధవారం సమర్పించిన ఈ వినతిలో, ఏరియా లెవల్ స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఖాళీగా ఉన్న టైమ్ రేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని యాజమాన్యం అంగీకరించినప్పటికీ అమలు జరగలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కోల్ కట్టర్, సపోర్ట్ మెన్, లైన్ మెన్ పోస్టుల భర్తీకి మాత్రమే నోటీసు జారీ చేసినట్లు, మిగతా ఖాళీ పోస్టుల గురించి ఎలాంటి ప్రకటన చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ఖాళీగా ఉన్న టైమ్ రేటెడ్ పోస్టులను కూడా వెంటనే నోటీస్ బోర్డ్ ద్వారా ప్రకటించి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై గని మేనేజర్ స్పందిస్తూ మిగతా ఖాళీల భర్తీ అంశాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు ఎం. చక్రపాణి, కుక్కల శ్రీనివాస్, గడ్డం బాలకృష్ణ, పొన్నం రంజిత్, శశాంక్, అడివి మల్లయ్య, అంగిడి రమేశ్, ఎం. కిరణ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్య వేత్త మధు బావల్కర్‌కు సత్కారం



**మాజీ ఎమ్మెల్యే బోస్లె నారాయణరావు పాటిల్ అభినందనలు**

**అగ్ని ధార న్యూస్ ,(ముధోల్):**

ఆదిలాబాద్‌కు చెందిన ప్రముఖ సాహిత్య వేత్త, రచయిత మధు బావల్కర్‌ను ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ శాసనసభ్యుడు బోస్లె నారాయణరావు పాటిల్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధు బావల్కర్ సాహిత్య రంగంలో అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. సమాజానికి మంచి సందేశాలు అందించేలా ఆయన రచనలు కొనసాగుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విలువైన రచనల ద్వారా సమాజానికి మార్గదర్శకత్వం అందించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, మాజీ ఎంపీపీ రామచంద్ర రెడ్డి, చంద్రకాంత్ యాదవ్, నాయకులు శివాజీ, దేవిదాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పట్టాలపై లోకయుక్తను ఆశ్రయిస్తాం

**పోతారం భూముల వివాదంపై దళిత నాయకుడు ఊట్ల శ్రీను**

**అగ్నిధార న్యూస్ ,(ముత్తారం):**

మండలంలోని పోతారం గ్రామంలో సర్వే నెంబర్ 59లో ఉన్న భూములపై అక్రమ పట్టాల మంజూరుపై లోకయుక్తను ఆశ్రయించనున్నట్లు మంథని డివిజన్ దళిత నాయకుడు ఊట్ల శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 50 సంవత్సరాలుగా పేద కూలీలు ఈ భూమిని సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నప్పటికీ వారికి ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదని ఆరోపించారు. అయితే గత 7--8 సంవత్సరాల క్రితం కొంతమంది వ్యక్తులు అధికారులను తప్పుదారి పట్టించి అక్రమంగా పట్టాలు పొందారని పేర్కొన్నారు. నిజమైన అర్హులు దశాబ్దాలుగా భూమిని సాగు చేస్తూ ఉన్నప్పటికీ వారికి హక్కులు కల్పించకుండా, అక్రమంగా పట్టాలు పొందిన వారికి లాభాలు చేకూరడం అన్యాయమని విమర్శించారు. ఇప్పటికైనా అక్రమ పట్టాలు పొందిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, నిజమైన అర్హులకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై హైదరాబాద్‌లోని లోకయుక్తను ఆశ్రయించి న్యాయం కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పేదలకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని ఊట్ల శ్రీను తెలిపారు.

# ప్రభుత్వ హామీలు అమలు చేయాలి

**ఎమ్మార్వోకు బీజేపీ నాయకుల వినతిపత్రం**

అగ్నిధార న్యూస్ ,(రామగుండం):

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు రామగుండం ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ మండల అధ్యక్షులు ఊరగొండ అపర్ణ, గుండెబోయిన భూమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి పాల్గొని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి హామీలు ఇప్పటికీ అమలు కాలేదని ఆరోపించారు. మండలంలో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా సకాలంలో అందక అప్పులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆసరా పెన్షన్లు అందడం లేదని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. పేదలకు గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల



మంజూరు ఆలస్యం అవుతోందని, భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన దరఖాస్తులు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, వీధి దీపాల సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ముసుకుల భాస్కర్ రెడ్డి, సుల్వ లక్ష్మీనరసయ్య, కోడూరి రమేష్, మాదరబోయిన రాకేష్, రామగిరి నరేష్, పాకాల నరసింహారెడ్డి, ఎల్తూరి సరిత, ఎల్తూరి రాజయ్య, అంకరి భరత్, ఆకునూరి రమేష్, కొమురవెల్లి విశ్వనాథ్, ఇరుగు రాళ శివ, ఆలకుంట మహేష్, గోగుల రమేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల పెన్షన్ పెంపు కోరిన ఎంపీ




**సీఎంపీఎఫ్ కమిషనర్‌తో వంశీ కృష్ణ భేటీ**

అగ్నిధార న్యూస్,(న్యూఢిల్లీ):

సింగరేణి బొగ్గు కార్మికుల పెన్షన్ సమస్యలపై పెద్దపల్లి లోక్‌సభ సభ్యుడు గడ్డం వంశీ కృష్ణ కేంద్ర అధికారులతో చర్చించారు. బుధవారం న్యూఢిల్లీలోని తన కార్యాలయంలో సీఎంపీఎఫ్ కమిషనర్, కోల్ కంట్రోలర్ సజీష్ కుమార్ ఎన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 'కోల్ మైన్స్ పెన్షన్ ఫండ్ (జవీఫీ), 1998' పథకం కింద పదవీ విరమణ చేసిన కార్మికుల పరిస్థితిని ఎంపీ వివరించారు. ప్రస్తుతం సింగరేణి నుంచి రిటైర్ అయిన కార్మికులకు లభిస్తున్న పెన్షన్ చాలా తక్కువగా ఉండటంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జీవితాంతం కష్టపడి పని చేసిన కార్మికులు గౌరవప్రదమైన జీవితం గడపాలంటే పెన్షన్లు పెంచడం అత్యవసరమని వంశీ కృష్ణ పేర్కొన్నారు. ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, ప్రస్తుత నిబంధనల ప్రకారం అంశాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## అనుమానం పెనుభూతం
## అక్కను కడతేర్చిన తమ్ముడు

**రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా బాటసింగారంలో దారుణం జరిగింది. అక్క చెడు తిరుగుళ్లు తిరుగుతుందనే అనుమానంతో తమ్ముడు అక్కని చంపి ముక్కలు చేసి చెరువులో పడవేసిన ఘటన బయటపడింది. కొన్నాళ్ల క్రితం బావ చనిపోయిన తర్వాత అక్క ప్రవర్తన సరిగా లేదనే కోపంతో తమ్ముడు పు రామ్ ఆమెను రెండు భాగాలుగా చేసి మజీత్ పూర్ చెరువులో పడేసాడు. గత నెల 28 నాడు బాటసింగారం కిరణం షాపు నుండి తప్పిపోయిందని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో హత్య వ్యవహారం బయటపడింది.

## రహదారిని కబ్జా చేసారు
## రోడ్డెక్కిన శంషీగూడ స్థానికులు

**కూకట్ పల్లి :** ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని శాంషీ గూడ చెందిన ప్రజలు ఆందోళన చేపట్టారు. ప్రగతి నగర్ లోని ప్రణీత్ ఆంటీలియా తరహాలో శంషీగూడలో శిల్పా బృందావనం, సాయి హిల్స్ వాసులు కూడా రహదారిని కబ్జా చేసి గేట్లను ఏర్పాటు చేసి ఎవరిని రానివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం ప్రజలు రోడ్డెక్కారు. శనివారం,ఆదివారాలు వస్తే శాంషీ గూడ నుండి ఎల్లమ్మబండ కు వెళ్లడానికి సుమారు రెండు గంటల సమయం పడుతుందని ఆరోపించారు. శిల్ప బృందావన్ నివాసాలు అన్ని హెచ్ఎండిఏ లేఔట్ తో ఏర్పాటుచేసి గేటెడ్ కమ్యూనిటీ అంటూ రహదారిని మూసివేసారని అన్నారు. అదేవిధంగా సాయి హిల్స్ వాసులు కూడా రోడ్డు పై గోడ నిర్మాణం చేపట్టడం పైన ఇప్పటికే డిప్యూటీ కమిషనర్లకు ఉన్న అధికారులకు ఫిర్యాదు చేశామని అన్నారు. తమకు స్పీకింగ్ ఆర్డర్లలో తోపాటు వీటిని తొలగించాలని ఆదేశాలు ఉన్న ఎవరూ పట్టించుకోకపోవడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను సైతం ఆశ్రయించి ఫిర్యాదు చేశామని తెలిపారు. వీటి పైన విచారణ జరిపి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు స్పందించి ఈ రోడ్డును ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని దీని ద్వారా మియాపూర్ నుండి వచ్చేవారు నేరుగా గాజులరామారం వెళ్లేందుకు వీలు ఉంటుంది అని తెలిపారు.

## పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ పంజా

**లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఆర్ఐ రిచర్డ్ సైమన్**

**కార్యాలయంలో రికార్డుల క్షుణ్ణంగా పరిశీలన.**

**వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అవినీతి నిరోధక శాఖ (ంఅః) అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడులు రెవెన్యూ వర్గాల్లో తీవ్ర కలకలం రేపాయి. ఒక వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేసిన ఘటనలో పెద్దేముల్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) రిచర్డ్ సైమన్ అధికారులకు చిక్కారు. గుడిమల్కాపూర్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి తన మోటేషన్ ఫైల్ (ఓబీబిజీబితిసీని ఈతిశ్రీవ) ప్రక్రియ పూర్తి చేయించుకోవడానికి ఆర్ఐ రిచర్డ్ సైమన్‌ను సంప్రదించారు. ఇందుకు గాను ఆర్ఐ రూ. 15,000 లంచం డిమాండ్ చేశారు. బాధితుడి నుంచి ఫిర్యాదు అందుకున్న ఏసీబీ రంగారెడ్డి రేంజ్ అధికారులు పక్కా ప్రణాళికతో దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటుండగా రిచర్డ్ సైమన్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. కార్యాలయంలోని పలు కీలక రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, ధరణికి సంబంధించిన వ్యవహారాలు, ఇతర అవకతవకలపై ఆరా తీస్తున్నారు.

## నడి రోడ్డుపై పసికందు మృతదేహం కలకలం

**ఆదిలాబాద్ :** గుడిహత్నూర్ మండల సమీపంలో జాతీయ రహదారి పక్కన మగ పసికందు మృతదేహం లభ్యమైంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పసికందును ఎవరైనా కావాలనే వదిలేశారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## తమిళనాడు ఎన్నికల బిజెపి ఎస్సీ మోర్చా కో-ఇంచార్జ్ గా 'ఎస్. కుమార్' నియామకం

**హైదరాబాద్ :** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శిగా కొనసాగుతున్న 'శ్రీ ఎస్. కుమార్' గారికి పార్టీ కీలక బాధ్యతలను అప్పగించింది. తమిళనాడులో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని, ఆ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఎన్నికల సహ-ప్రభారీ (కో-ఇంచార్జ్) గా ఆయనను నియమిస్తూ బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షులు లాల్ సింగ్ ఆర్య ఉత్తర్వులు జారీ చేశారు. తమిళనాడుతో పాటు పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి, కేరళం రాష్ట్రాలకు కూడా ఎస్సీ మోర్చా తరపున ప్రభారీలను, సహ-ప్రభారీలను నియమించారు. ఇందులో భాగంగా తమిళనాడు రాష్ట్రానికి ప్రభారీగా శ్రీ శంభునాథ్ తుండియా గారిని, సహ-ప్రభారీలుగా ఎస్. కుమార్ ని మరియు ఎస్. మునిస్వామి (మాజీ ఎంపీ) గారిని నియమించారు. ఎస్. కుమార్ గత కొంతకాలంగా ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శిగా పార్టీ బలోపేతానికి విశేష కృషి చేస్తున్నారు. ఆయన పనితీరును గుర్తించిన పార్టీ నాయకత్వం, తమిళనాడు ఎన్నికల్లో ఓటర్లను సమన్వయం చేసుకుంటూ, పార్టీ విజయానికి వ్యూహరచన చేసేందుకు ఈ కీలక బాధ్యతను కట్టబెట్టింది.

# ట్రినిటీ బిఈడి కళాశాలలో ముందస్తు ఉగాది వేడుకలు





**హాజరైన ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి.**

అగ్నిధారన్యూస్ పెద్దపల్లి

ప్రకృతి ఒక పవిత్రతను ఈ సమాజానికి అందించడానికి తోడ్పెట్టే టట్లు చేసినవే మనం జరుపుకునే పండుగలు అని ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపకులు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు .పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ట్రినిటీ బిఈడి డిఈడి శిక్షణ కళాశాలలో బుధవారం జరిగిన ఉగాది రంజాన్ పండుగల ముందస్తు సంబరాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సమాజానికి భావి ఉపాధ్యాయులుగా చాత్రోపాధ్యాయులు పండుగలకు మూలాలను గ్రహించి ప్రకృతి ప్రసాదించినటువంటి కాలానుగుణంగా జరిగే మార్పులను పర్యావరణాన్ని ఈ భూమికున్న ప్రత్యేకతను భావితరాలకు చాటాలని పేర్కొన్నారు .నూతన సంవత్సర యుగారంభానికి ఈ ఉగాది సంకేతమని పవిత్ర మాసంగా ప్రబోధించే రంజాన్ పండుగ నిష్టతో కూడిన రోజా కార్యక్రమం ఇది ఒక ప్రత్యేకత అని వీటి వెనకాల ఒక సైంటిఫిక్ నేచర్ ఒదిగి ఉందని వాటిని సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం విద్యార్థులకు హైందవ విద్యార్థులు ఇఫ్తారు కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అలాగే షడ్రుచుల సమ్మేళనంతో కూడిన ఉగాది పంచభక్ష పరమాన్నాలతో కూడిన రుచులను ముస్లిం విద్యార్థులు ముస్లిం మేతర విద్యార్థులకు అందించడం ఒక గొప్ప సాంప్రదాయమని మతసామరస్యానికి ప్రతీక అని కొనియాడారు .ఈ సందర్భంగా విద్యార్థులకు ఉగాది పచ్చడి భక్షాలు స్వీట్లు పండ్లు పచ్చళ్ళు అందించారు. అనంతరం ఉగాది ప్రత్యేకతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలతో అలరింప చేశారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి అకాడమిక్ డైరెక్టర్ డాక్టరు దాసరి మమతారెడ్డి ప్రిన్సిపాల్ లు బుర్ర తిరుపతి రజని జైపాల్ హరి రెడ్డమ్మ అధ్యాపకులు దిలీప్ శర్మ మధుకర్ పి తిరుపతి రమేష్ జ్యోతి నీరజ శ్రీవాణి శారద తదితరులు పాల్గొన్నారు.

# దుబాయ్‌లో భయానక అనుభవాలను పంచుకున్న సానియా మీర్జా

**హైదరాబాద్ :** మిడిల్ ఈస్ట్ దేశాలలో ముదురుతున్న యుద్ధ మేఘాలు అక్కడ నివసిస్తున్న భారతీయులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో టెన్నిస్ స్టార్ సానియా మీర్జా తన కుమారుడు ఇజ్ హాన్ తో కలిసి క్షేమంగా దుబాయ్ నుండి భారత్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె పంచుకున్న అనుభవాలు అక్కడి భయానక స్థితికి అద్దం పడుతున్నాయి. దుబాయ్‌లో తాను ఎదుర్కొన్న గడ్డు పరిస్థితులను వివరిస్తూ సానియా మీర్జా కాస్త ఉద్వేగానికి లోనయింది. తమ ఇంటిపై నుండే యుద్ధ విమానాలు వెళ్లడం, అవి ఒకదానికొకటి అడ్డుకోవడం చూసినప్పుడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నామని ఆమె తెలిపింది. "మా ఇంటికి కేవలం 400 నుండి 500 మీటర్ల దూరంలోనే విమాన శకలాలు పడ్డాయి. ఆ శబ్దాలకు, దృశ్యాలకు ఇంట్లోనే ఉండి వణికిపోయాం" అని సానియా పేర్కొంది. ప్రస్తుతం కొడుకుతో కలిసి హైదరాబాద్ కు వచ్చిన ఆమె, రంజాన్ పండుగ ముగిసిన తర్వాత పరిస్థితులు చక్కబడితేనే తిరిగి దుబాయ్ వెళ్లాలని భావిస్తోంది.

**ఇరాన్ బంకర్లపై కాల్పులు**

పశ్చిమాసియాలో భీకర యుద్ధం కొనసాగుతుంది. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జల సంధిని నియంత్రిస్తున్న ఇరాన్ అడ్డుకునే ప్రయత్నాలను అమెరికా సైన్యం ముమ్మరం చేసింది. ఈ క్రమంలో బుధవారం హర్మూజ్ సమీపంలోని ఇరాన్ క్షిపణి స్థావరాలపై బంకర్ బస్టర్ బాంబులతో విరుచుకుపడింది. దాదాపు 2,268 కిలోల బాంబులతో దాడిచేసినట్టు అమెరికా సైన్యానికి చెందిన సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. దీనికి సమీపంలోని భూగర్భ మిస్సైల్ సిటీ ఖేమ్క్‌పై సైతం దాడిచేసినట్టు తెలిపింది.'హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ యాంటీ- నౌక విధ్వంసక క్షిపణి స్థావరాలు అంతర్జాతీయ సముద్ర రవాణాకు ప్రమాదకరంగా మారాయి. అందుకే ఈ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాం.. లోతుగా చొచ్చుకుపోయే 5 వేల పౌండ్ల బరువు (దాదాపు 2,268 కిలోలు) ఉన్న శక్తిమంతమైన బంకర్ బస్టర్ బాంబులతో దాడులు నిర్వహించాం" అని అమెరికా సెంట్రల్ కమాండ్ ఎక్స్ (ట్విట్టర్)లో వెల్లడించింది. అమెరికా-ఇజ్రాయెల్‌లు సంయుక్త ఆపరేషన్‌తో ఇరాన్‌పై ఫిబ్రవరి 28న దాడులు చేయడంతో యుద్ధం మొదలైంది. దీంతో ఐదో వంతు ప్రపంచ చమురు రవాణాకు ముఖ్యమైన హర్మూజ్‌లో నౌకలను ఇరాన్ అడ్డుకోవడంతో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు భగ్గుమంటున్నాయి. ఇదిలా ఉండగా, హర్మూజ్ రక్షణకు తమతో చేతులు కలపాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను నాటో సహా మిత్రదేశాలు తిరస్కరించాయి. ప్రపంచం కోసమే తాను యుద్ధం చేస్తున్నానని ట్రంప్ చెబుతున్న మాటలను ఎవరూ విశ్వసించడం లేదు. ఆయన చర్యలను ఎవరూ సమర్థించడం లేదు."మేము నాటోకు ఎంతో సహాయం చేసినప్పటికీ



అమెరికాకు మద్దతు లభించడం లేదు" అని ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోకుండా అడ్డుకోవడం మిత్రదేశాల ప్రయోజనాలకే శ్రేయస్కరమని ఆయన పేర్కొన్నారు. అణ్వాయుధాలను అభివృద్ధి చేసే ఉద్దేశం తమకు లేదని, కేవలం విద్యుదుత్పత్తి వంటి శాంతియుత ప్రయోజనాల కోసమే తమ అణు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని ఇరాన్ గట్టిగా చెబుతోంది. తమ యుద్ధ నౌకలను హర్మూజ్‌కు పంపడానికి మిత్రదేశాలు నిరాకరించిన కొద్ది గంటల్లోనే అమెరికా బంకర్ బస్టర్ బాంబులతో దాడులు చేపట్టింది. హర్మూజ్‌లో చమురు రవాణాకు ఆటంకం ఏర్పడకూడదనుకుంటే ఇరాన్ మిస్సైల్ నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేయాల్సిన అవసరం ఉందని అమెరికా భావిస్తోంది. తద్వారా ఈ మార్గంలో వెళ్లే నౌకలపై ఇరాన్ దాడులను అడ్డుకుంటామని తాజా చర్యతో అమెరికా సంకేతాలిచ్చినట్లయ్యింది.

# తమలపాకుల సీక్రెట్స్..



భారతీయ సంస్కృతిలో తమలపాకులకు విశిష్ట స్థానం ఉంది. తమలపాకు సంప్రదాయంగా శుభకార్యాల్లో బంధాలను సూచిస్తుంది. ఇది జీర్ణక్రియకు అద్భుతమైన ఔషధం. కాల్షియం గ్రహణానికి, పిల్లల్లో కడుపు నొప్పికి, కళ్ల వేడి తగ్గించడానికి తమలపాకును పలు రకాలుగా ఉపయోగిస్తారు. అయితే, దీనిని ఔషధంగా వాడాలి తప్ప అలవాటుగా మార్చుకోకూడదంటున్నారు ఆరోగ్య, ఆయుర్వేద నిపుణులు.. తమలపాకు, భారతీయ సంస్కృతిలో ప్రాముఖ్యత కలిగిన ఒక మొక్క.. శుభకార్యాల నుండి వ్యాపార ఒప్పందాల వరకు తాంబూలం మార్పిడి ద్వారా బంధాలను, విశ్వాసాన్ని వ్యక్తం చేసే ఒక సంప్రదాయంగా ఇది వేళ్లూనుకుంది. తమలపాకు కేవలం ఆచార వ్యవహారాలకు మాత్రమే పరిమితం కాకుండా, అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఎన్నో ఔషధ గుణాలు దాగున్న తమలపాకు.. బహుళ ప్రయోజనాలను అందిస్తుందని.. ఆరోగ్యానికి ఇది చాలా మంచిదని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు..తమలపాకు జీర్ణక్రియను మెరుగుపరచడం, దగ్గు-జలుబు తగ్గించడం, నోటి దుర్వాసన పోగొట్టడం, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాల ద్వారా రోగనిరోధక శక్తిని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఇంకా మలబద్ధకం నివారణకు, చర్మ, జుట్టు ఆరోగ్యానికి కూడా సహాయపడుతుంది. ఇది ఆయుర్వేదంలో ఒక ముఖ్యమైన ఔషధ ఆకుగా పేర్కొంటారు.

**తమలపాకు సంప్రదాయ ప్రాముఖ్యత:**
తమలపాకు చరిత్రను పరిశీలిస్తే, ఇది కేవలం నమలడానికి మాత్రమే కాదని తెలుస్తుంది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల్లో తాంబూలం ఇచ్చిపుచ్చుకోవడం అనేది రెండు కుటుంబాల మధ్య సంబంధాన్ని, ఒప్పందాన్ని సూచిస్తుంది. పూర్వకాలంలో వ్యాపార లావాదేవీలలో సైతం ఒప్పందాలను దృఢపరచడానికి తాంబూలం వినియోగించేవారని చరిత్ర చెబుతోంది. తాంబూలం మార్పిడిని ఒక రకమైన అగ్రిమెంట్ లేదా బంధంగా భావించేవారు.. ఇది లిఖితపూర్వక ఒప్పందాల అవసరాన్ని తగ్గించేది.

**జీర్ణవ్యవస్థకు మేలు:**
తమలపాకు ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలలో ఒకటి జీర్ణక్రియకు సహాయపడటం.. భారీగా భోజనం చేసిన తర్వాత, ముఖ్యంగా నూనె, స్వీట్లు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు, ఒక తమలపాకును చిన్న పటిక బెల్లం ముక్కతో కలిపి నమలడం వల్ల ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. ఇది గ్యాస్ట్రిక్ సమస్యలను నివారిస్తుంది, ఆహారం అరగడానికి తోడ్పడుతుంది. రాత్రిపూట దీనిని తీసుకుంటే ఉదయం సుఖ విరేచనం అయ్యేందుకు సహాయపడుతుంది. అయితే, దీనిని అలవాటుగా కాకుండా, అవసరమైనప్పుడు ఔషధంగా మాత్రమే ఉపయోగించాలని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.కాల్షియం గ్రహణానికి: తమలపాకుతో పాటు కొద్దిగా సున్నం కలిపి నమలడం వల్ల శరీరం కాల్షియంను మెరుగ్గా గ్రహిస్తుంది. కాల్షియం మాత్రల కన్నా ఈ సహజ పద్ధతి ద్వారా శరీరానికి కాల్షియం లభిస్తుందని చెబుతారు. సున్నం చాలా తక్కువ మోతాదులో, తమలపాకుకు పలచగా రాసి తీసుకోవాలి.

పిల్లల్లో కడుపు నొప్పికి ఉపశమనం: చిన్న పిల్లల్లో వచ్చే కడుపు నొప్పి, ఉబ్బరానికి తమలపాకు ఒక సహజ చికిత్స. తమలపాకుకు కొద్దిగా ఆముదం రాసి, పెనంపై గోరువెచ్చగా వేడి చేసి, పిల్లల పొట్టపై ఉంచి బట్టతో కట్టాలి. ఇలా రెండు సార్లు చేస్తే పొట్ట ఉబ్బరం తగ్గి, జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కళ్ల సంరక్షణకు: కళ్ల వేడిని తగ్గించడానికి, దృష్టి లోపాలను నియంత్రించడానికి తమలపాకును ఉపయోగించవచ్చు. పెరుగు లేదా చిక్కటి మజ్జిగలో తమలపాకులను నలిపి ముంచి, సుమారు అరగంట నుండి రాత్రంతా నానబెట్టాలి. అనంతరం, ఆ మజ్జిగను కళ్లపై వేసుకుని 20-30 నిమిషాల పాటు విశ్రాంతి తీసుకోవాలి. ఇది కళ్ల వేడిని తగ్గించి, దృష్టికి మేలు చేస్తుందని వివరించారు. తమలపాకుతో బటర్ మిల్క్ (మజ్జిగ) కూడా తయారు చేసుకోవచ్చు. ఒక లీటరు మజ్జిగకు రెండు లేదా మూడు ఆకులు, కొద్దిగా సోంపు, జీలకర్ర, పటిక బెల్లం (తీపి కోసం), లేదా పచ్చిమిర్చి, పుదీనా, అల్లం (కారంగా కావాలంటే) కలిపి మిక్సీ చేసి తాగవచ్చు. తమలపాకుతో బజ్జీలు కూడా తయారు చేస్తారు.. ఇవి రుచిగా ఉంటాయి. అయితే, తమలపాకును వాడేటప్పుడు సరైన పద్ధతిని పాటించడం అత్యవసరం. దీనిని ఔషధంగా భావించి, పరిమితంగా వాడాలి. రోజువారీ అలవాటుగా మార్చుకోవడం వల్ల కొన్ని అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తమలపాకులో దాగి ఉన్న ఈ అద్భుత రహస్యాలను తెలుసుకొని, సరైన రీతిలో వినియోగించుకోవడం ద్వారా మనం ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు.

# జ్ఞాపకశక్తిని రెట్టింపు చేసే ఎర్ర ముత్యాలు!



పండ్లు మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ముఖ్యంగా ఎర్రటి గింజలు కలిగిన దానిమ్మలోని పోషకాలు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వీటిల్లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఫైబర్, విటమిన్ సి, విటమిన్ కె, పొటాషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడానికి ఎంతగానో సహాయపడతాయి.. పండ్లు మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ముఖ్యంగా ఎర్రటి గింజలు కలిగిన దానిమ్మలోని పోషకాలు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వీటిల్లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఫైబర్, విటమిన్ సి, విటమిన్ కె, పొటాషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడానికి ఎంతగానో సహాయపడతాయి. ముఖ్యంగా ప్రతిరోజూ దానిమ్మపండు తినడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. దానిమ్మలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది. దీనివల్ల రక్తహీనత వంటి సమస్యలు తగ్గుతాయి. దానిమ్మలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవి శరీరంలో వాపును తగ్గించడంలో సహాయపడతాయి. దీనిని తినడం వల్ల కీళ్లవాతం, దీర్ఘకాలిక వాపు నుండి ఉపశమనం లభిస్తుంది. అంతేకాకుండా దానిమ్మలోని యాంటీఆక్సిడెంట్లు కణాలను దెబ్బతినకుండా కాపాడి, తద్వారా వాపును తగ్గిస్తాయి.గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో దానిమ్మ చాలా సహాయపడుతుంది. దీనిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, పాలిఫెనాల్లు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, ఆరోగ్యకరమైన రక్తనాళాలను కాపాడటంలో, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. ఇది గుండెపోటు ప్రమాదాన్ని కూడా గణనీయంగా తగ్గిస్తుంది. దానిమ్మలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి తెల్ల రక్త కణాల సంఖ్యను పెంచడంలో సహాయపడతాయి. వీటిని క్రమం తప్పకుండా తినడం వల్ల జలుబు, దగ్గు, ఫ్లూ వంటి సాధారణ ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. దానిమ్మలో శరీరానికి అవసరమైన ఫైబర్‌లో 45% ఉంటుంది. ఇది మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగించి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అధ్యయనాల ప్రకారం, ప్రతిరోజూ దానిమ్మపండు తినడం వల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. వయసుతో పాటు వచ్చే అల్జీమర్స్ వంటి వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తుంది. ఇది మెదడు కణాలకు జరిగే నష్టాన్ని కూడా నివారిస్తుంది. దానిమ్మలోని వృద్ధాప్య నిరోధక గుణాలు చర్మ కణాలను పునరుద్ధరించడానికి, చర్మ కాంతిని పెంచడానికి, ముడతలను తొలగించడానికి, చర్మాన్ని ఆరోగ్యంగా, తాజాగా కనిపించేలా చేయడానికి సహాయపడతాయి.

# ఈ టమాటోలతో క్యాన్సర్ పరార్



బ్లాక్ చెర్రీ టమాటోలు ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన పోషకాల గని. వీటిలో ఉండే ఆంథోసైనిన్స్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ల వల్లే వీటికి ఆ నలుపు రంగు వస్తుంది. విటమిన్ ం, అ మరియు పొటాషియం సమృద్ధిగా ఉండే ఈ టమాటోలు కేవలం రుచిని మాత్రమే కాకుండా, శరీరానికి అవసరమైన రోగనిరోధక శక్తిని కూడా అందిస్తాయి. సాధారణంగా టమాటోలు అంటే ఎరుపు రంగులో ఉంటాయని మనందరికీ తెలుసు. కానీ, ఇటీవల మార్కెట్‌లో నలుపు, ముదురు ఊదా రంగులో మెరిసిపోయే 'బ్లాక్ చెర్రీ టమాటోలు' అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఇవి కేవలం చూడటానికి ప్రత్యేకంగా ఉండటమే కాదు, వీటి రుచి మరియు ఆరోగ్య ప్రయోజనాలు కూడా అద్భుతం. సాధారణ టమాటోల కంటే తీయ్యగా, జ్యూసీగా ఉండే ఈ బుజ్జి టమాటోలు ఇప్పుడు హెల్త్ కాన్షియస్ ఉన్నవారి డైట్‌లో ముఖ్య భాగమయ్యాయి. బ్లాక్ చెర్రీ టమాటోలలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలోని సోడియం స్థాయిలను సమతుల్యం చేసి, రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. తద్వారా గుండె సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గుతుంది. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడి, శరీరంలోని అన్ని అవయవాలకు ఆక్సిజన్ సరైన రీతిలో అందుతుంది. ఈ టమాటోల్లో ఉండే విటమిన్ అ మరియు యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షించి, వృద్ధాప్య ఛాయలు రాకుండా చేస్తాయి. చర్మం సహజంగా మెరిసిపోవడానికి ఇది ఎంతో దోహదపడుతుంది. అలాగే ఇందులోని విటమిన్ ం రేచీకటి వంటి సమస్యలను నివారించి, కంటి చూపును మెరుగుపరుస్తుంది. డిజిటల్ స్క్రీన్ల ముందు ఎక్కువ సమయం గడిపే నేటి తరానికి ఇది ఒక అద్భుతమైన ఆహారం.బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి బ్లాక్ చెర్రీ టమాటోలు ఒక వరం అని చెప్పవచ్చు. వీటిలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి మరియు ఫైబర్ (పీచు పదార్థం) ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది, మలబద్ధకం వంటి సమస్యలు దూరమవుతాయి. తక్కువ ఆహారం తీసుకున్నా కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తాయి.వీటిని కేవలం పచ్చిగా తినడమే కాకుండా సలాడ్లు, పాస్తా, సూప్‌లలో ఉపయోగిస్తే వంటకాలకు ఒక ప్రత్యేకమైన ఫ్లేవర్ వస్తుంది. వీటిలోని తీపి మరియు పులుపు మేళవింపు భోజనానికి కొత్త రుచిని జోడిస్తుంది. బ్లాక్ చెర్రీ టమాటోలను మీ రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల చిన్న చిన్న ఇన్ఫెక్షన్ల నుండి దీర్ఘకాలిక వ్యాధుల వరకు అన్నిటికీ చెక్ పెట్టవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ఈ 'నల్లటి మణిపూసలను' మీ డైట్‌లో చేర్చుకోండి.

# గర్భనిరోధక మాత్రలతో క్యాన్సరా..?



క్యాన్సర్ గురించి సమాచారం అందించే సంస్థ అయిన క్యాన్సర్‌రీసెర్చ్‌యూకే నివేదిక ప్రకారం.. గర్భనిరోధక మాత్రలు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి: ఒకటి కంబైన్డ్ పిల్, ఇందులో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టోజెన్ అనే రెండు హార్మోన్లు ఉంటాయి. గర్భనిరోధక మాత్రలు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయా ? ఈ ప్రశ్న తరచుగా తలెత్తుతుంది. నిజం ఏమిటంటే గర్భనిరోధక మాత్రలు చాలా కాలంగా వాడుకలో ఉన్నాయి. అవి శరీరంలోని హార్మోన్లను ప్రభావితం చేసి, గర్భధారణను నివారిస్తాయి. కానీ అవి నిజంగా క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయా? క్యాన్సర్ గురించి సమాచారం అందించే సంస్థ అయిన క్యాన్సర్‌రీసెర్చ్‌యూకే (అజీనిఇవతీతీవబవజీతీఇష్ట్రబీని) నివేదిక ప్రకారం.. గర్భనిరోధక మాత్రలు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి: ఒకటి కంబైన్డ్ పిల్, ఇందులో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టోజెన్ అనే రెండు హార్మోన్లు ఉంటాయి. మరొకటి మినీ పిల్, ఇందులో కేవలం ప్రొజెస్టోజెన్ మాత్రమే ఉంటుంది. ఈ మాత్రలు శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను మార్చడం ద్వారా పనిచేస్తాయి. ఇప్పుడు క్యాన్సర్ ప్రమాదం గురించి మాట్లాడుకుందాం. పరిశోధనల ప్రకారం, కంబైన్డ్ పిల్ తీసుకోవడం వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం కొద్దిగా పెరగవచ్చు. కానీ ఈ ప్రమాదం శాశ్వతం కాదు. ఒక వ్యక్తి సుమారు 10 సంవత్సరాల తర్వాత ఈ మాత్రలు తీసుకోవడం ఆపేస్తే వారు అసలు మాత్రలు తీసుకోనట్లే ఈ ప్రమాదం సాధారణ స్థితికి వచ్చేస్తుంది. ఇదే కాంబైన్డ్ పిల్ వాడటం వల్ల ముఖ్యంగా దీర్ఘకాలం పాటు వాడినప్పుడు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కొద్దిగా పెరిగే అవకాశం ఉందని తేలింది. అయితే దీనిపై మరింత పరిశోధన అవసరం. అందుకే దీనిని నిశ్చయాత్మకమైనదిగా పరిగణించలేము. ఆసక్తికరంగా ఈ పిల్ అండాశయ, ఎండోమెట్రియల్ క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్ల నుండి కూడా రక్షణ కల్పిస్తున్నట్లు కనిపిస్తోంది. అలాగే ఈ ప్రయోజనం పిల్ వాడకం ఆపేసిన తర్వాత కూడా కొనసాగుతుంది. మినీ పిల్ గురించి పరిమిత పరిశోధన మాత్రమే జరిగింది కాబట్టి, దాని గురించిన సమాచారం కూడా పరిమితంగానే ఉంది. అయితే, ఇప్పటివరకు ఉన్న డేటా ప్రకారం ఇది రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని కొద్దిగా పెంచవచ్చని, కానీ దీనిని వాడటం ఆపేసిన తర్వాత ఈ ప్రమాదం క్రమంగా తగ్గుతుందని తెలుస్తోంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, ఇతర క్యాన్సర్లపై దీని ప్రభావాల గురించి ఇంకా స్పష్టమైన నిర్ధారణలు లేవు. ఇప్పుడు ఒక ప్రశ్న తలెత్తుతుంది: మీరు ఈ మాత్రలు తీసుకోవాలా? ఈ ప్రశ్నకు సమాధానం వ్యక్తిని బట్టి మారవచ్చు. మీ ఆరోగ్యం, అవసరాలు, ప్రమాదాల ఆధారంగా మీ డాక్టర్ తగిన సలహా ఇవ్వగలరు. క్యాన్సర్ ప్రమాదం కేవలం మాత్రల వల్ల మాత్రమే కాకుండా, ధూమపానం, ఊబకాయం, మద్యపానం వంటి అనేక ఇతర కారకాల వల్ల కూడా ప్రభావితమవుతుందని అర్థం చేసుకోవడం ముఖ్యం.

# జిడిపికి చమురు దెబ్బ!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామ్రాజ్యవాద పోకడలతో పశ్చిమాసియాలో రేపిన చిచ్చు.. భారత ఆర్థిక వ్యవస్థకు సెగ పెడుతోంది. వేల మైళ్ల దూరంలో ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా సంయుక్తంగా సాగిస్తోన్న మారణకాండ భారత జిడిపిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ముడి చమురు బ్యారెల్ ధర 100 డాలర్లు దాటడంతో పాటు దానికి తోడు దేశంలో నెలకొన్న తీవ్రమైన గ్యాస్ కొరత సామాన్యుల వంటగది నుండి భారీ పరిశ్రమల వరకు అన్ని రంగాలను అతలాకుతలం చేస్తోంది. ప్రధానంగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో భారత్ దిగుమతి చేసుకునే ఇంధన సరఫరాకు పెద్ద విఘాతం కలిగింది. దీనివల్ల దేశ వృద్ధి రేటు మందగించడమే కాకుండా, ద్రవ్యోల్బణం పెరిగి ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ఏజెన్సీలు, ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ తన ముడి చమురు అవసరాల కోసం 90 శాతం, వంట గ్యాస్ కోసం సగానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ప్రస్తుత సంక్షోభం కారణంగా దిగుమతులు నిలిచిపోవడంతో గోల్డ్‌మన్ శాక్స్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారత 2026 వృద్ధి అంచనాలను 6.5 శాతానికి తగ్గించాయి. ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలు తగ్గించి చమురు ధరల భారాన్ని కొంతవరకు భరించగలిగినప్పటికీ, పారిశ్రామిక రంగంపై పడే దెబ్బ వృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తుందని ఇండస్ ఇండ్ బ్యాంక్ ఆర్థికవేత్త గౌరవ్ కపూర్ విశ్లేషించారు. ఇప్పటికే గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో గ్యాస్ కొరత కారణంగా వేలాది ఇంజనీరింగ్ సంస్థలు తమ కార్యకలాపాలను నిలిపివేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రభావం కేవలం పరిశ్రమలకే పరిమితం కాకుండా సామాన్యుల జీవనోపాధిని కూడా దెబ్బతీస్తోంది. ముఖ్యంగా దేశంలో వేగంగా పెరుగుతున్న గిగ్ ఎకానమీలో భాగమైన లక్షలాది మంది డెలివరీ ఏజెంట్ల ఆదాయం ఇంధన ధరలు, గ్యాస్ కొరత వల్ల సగానికి పైగా పడిపోయింది. మరోవైపు గల్ఫ్ దేశాలకు జరిగే సుమారు 200 బిలియన్ డాలర్ల ఎగుమతులు కూడా ప్రమాదంలో పడ్డాయి. దీనివల్ల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే రికార్డు స్థాయిలో 92.5 వద్దకు పడిపోయింది. ఒకవైపు వృద్ధి తగ్గుతూ.. మరోవైపు ధరలు పెరుగుతుండటంతో భారత ఆర్థిక వ్యవస్థ ఒక క్లిష్టమైన పరీక్షను ఎదుర్కొంటోందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.




## బిజినెస్

### మార్కెట్లోకి డస్టర్ రీ-ఎంట్రీ




భారత వాహన మార్కెట్లో ఎస్‌యూవీలకు క్రేజ్ పెరగడానికి కారణమైన రెనాల్ట్ డస్టర్ మోడల్ తిరిగి దేశంలోని రీ-ఎంట్రీ ఇచ్చింది. మంగళవారం కంపెనీ తన సరికొత్త రెనాల్ట్ డస్టర్ 2026ను అధికారికంగా విడుదల చేసింది. ఈ ఎస్‌యూవీ ధర రూ. 10.49 లక్షల నుంచి ప్రారంభమవుతుంది, అయితే ప్రీ-బుకింగ్‌పై రూ. 10.29 లక్షలకే లభిస్తుందని కంపెనీ తెలిపింది. ప్రీమియం వేరియంట్ ధర రూ. 18.09 లక్షలుగా నిర్ణయించింది. బుకింగ్స్ ప్రారంభవగా, ఏప్రిల్ నుంచి డెలివరీలు మొదలవుతాయి. స్ట్రాంగ్ హైబ్రిడ్ ఈ-టెక్ 160 వేరియంట్ దీపావళి నాటికి అందుబాటులో ఉంటుందని కంపెనీ స్పష్టం చేసింది. రీ-ఎంట్రీ డస్టర్‌లో 6 ఎయిర్‌బ్యాగులతో పాటు ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, లెవల్ 2 సహా అనేక రకాల సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయి. గ్లోబల్ మోడల్‌తో పోలిస్తే మనదేశంలో విడుదలైన వేరియంట్ హెడ్‌ల్యాంప్ డిజైన్, ఐబ్రో డిజైన్ డీఆర్ఎల్ఎస్ మార్పులతో రావడం గమనార్హం.

### మార్చి 24న సాయి పేరెంటరల్ ఐపిఒ




ప్రముఖ ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్ కంపెనీ సాయి పేరెంటరల్ వచ్చే వారం ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే సెబీకి సమర్పించగా అనుమతులు జారీ అయ్యాయి. మార్చి 24న ఇష్యూ ప్రారంభం కానుందని ఆ కంపెనీ మంగళవారం వెల్లడించింది. మొత్తం రూ.409 కోట్ల నిధులను సమీకరించనున్నట్లు తెలిపింది. ఈ ఇష్యూ ద్వారా రూ.285 కోట్ల విలువైన కొత్త షేర్లతో పాటు ఆఫర్ ఫర్ సేల్ కింద 31.57 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. షేర్ల ధరల శ్రేణీని రూ.372-392గా నిర్ణయించింది. ఈ పబ్లిక్ ఇష్యూ తమ వృద్ధి ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని ఎస్‌పిఎల్ సిఎండి అనిల్ కె?కె తెలిపారు. ఐపిఒ ద్వారా సేకరించిన నిధులను గ్లోబల్ ఫార్ములేషన్ బిజినెస్‌ను బలోపేతం చేయడానికి, అలాగే ఇంజెక్టబుల్, ఓరల్ సాలిడ్ డోసేజ్ విభాగాల్లో కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ (సిడిఎంఒ) సామర్థ్యాలను విస్తరించడానికి వెచ్చించనున్నట్లు వెల్లడించారు. ఈ పెట్టుబడులు అంతర్జాతీయ మార్కెట్లలో కంపెనీ ఉనికిని మరింత సుస్థిరం చేయనున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# అమెరికా ఉత్పత్తులకు రెడ్‌కార్పెట్

ట్రంప్ ఆంక్షలకు తలొగ్గిన మోడీ సర్కార్ అమెరికా ఉత్పత్తులకు రెడ్‌కార్పెట్ వేస్తోంది. దీంతో ఆ దేశం నుంచి భారీగా దిగుమతులు జరగడంతో భారత వాణిజ్య లోటు పెరిగి.. ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. ట్రంప్ విధించిన భారీ టారిఫ్‌ల ప్రభావం భారత ఎగుమతులపై స్పష్టంగా కనిపిస్తోంది. సోమవారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో అమెరికాకు జరిగిన ఎగుమతులు 12.88 శాతం పతనమై 6.88 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఇదే సమయంలో అమెరికా నుండి దిగుమతులు 36.53 శాతం పెరిగి 4.48 బిలియన్ల డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్య లోటు అమాతం దాదాపు 30 బిలియన్ డాలర్లకు చేరడం తీవ్ర ఆందోళకరం. మరోవైపు చైనా నుంచి దిగుమతులు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 11 నెలల్లోనే చైనాతో వాణిజ్య లోటు 102.01 బిలియన్లకు చేరుకుని.. తొలిసారి 100 బిలియన్ల మైలురాయిని దాటేసింది. చైనాకు ఎగుమతులు పెరిగినప్పటికీ.. దిగుమతులు ఏకంగా 119.55 బిలియన్లకు చేరడం అధిక లోటుకు కారణమైంది. ఇతర దేశాల విషయానికి వస్తే.. స్విట్జర్లాండ్ నుండి బంగారం దిగుమతులు ఏడు రెట్లు పెరిగి 2.71 బిలియన్లకు చేరగా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలకు ఎగుమతులు వృద్ధిని నమోదు చేశాయి. అయితే బ్రిటన్, సౌదీ అరేబియా, సింగపూర్ వంటి కీలక మార్కెట్లకు ఎగుమతులు క్షీణించాయి. ఫిబ్రవరి 2026లో స్థూల ఎగుమతులు ఆశించిన స్థాయిలో పుంజుకోకపోగా.. దిగుమతులు ఏకంగా 21.61 శాతం ఎగబాకి 80.09 బిలియన్ డాలర్లకు చేరడం గమనార్హం. మరోవైపు సరుకుల ఎగుమతులు గత ఏడాదితో పోలిస్తే 11 శాతం క్షీణించి 36.61 బిలియన్ డాలర్లకు పడిపోవడంతో వాణిజ్య లోటు పెరిగింది. ఎగుమతులు పడిపోయి, దిగుమతుల భారం పెరగడం వల్ల దేశ కరెంట్ అకౌంట్ లోటు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది రూపాయి విలువపై ఒత్తిడి పెంచడమే కాకుండా, విదేశీ మారక నిల్వలపై కూడా ప్రతికూల ప్రభావం చూపనుంది. మరోవైపు.. పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు భారత వాణిజ్య రంగానికి మరిన్ని కష్టాలను తెచ్చిపెటొచ్చని నిపుణులు హెచ్చరించారు.



## స్పోర్ట్స్

# ఆ విషయంలో స్వార్థపరుడినే: సంజూ శాంసన్




టీ20 ప్రపంచకప్-2026 హీరో, టీమిండియా ఓపెనర్ సంజూ శాంసన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇతరుల మెప్పు కోసం తాను ఎప్పుడూ ఏ పనీ చేయలేదని తెలిపాడు. ఎల్లప్పుడూ తన మనసు చెప్పినట్లే నడుచుకున్నానని.. ఈ విషయంలో తాను స్వార్థపరుడినే అన్నాడు.

**దాగుడుమూతల మాదిరి..**

భారత టీ20 జట్టు ఓపెనర్‌గా 2024 నుంచి రాణిస్తున్న సంజూ శాంసన్.. శుబ్‌మన్ గిల్ పునరాగమనంతో కొన్నాళు తుదిజట్టులో చోటు కోల్పోయాడు. ఆ తర్వాత గిల్ స్థానంలో తిరిగి జట్టులోకి వచ్చినా.. సరిగ్గా వరల్డ్‌కప్ టోర్నీ ఆరంభానికి ముందే ఫామ్ కోల్పోయాడు. దీంతో ఓపెనర్, వికెట్ కీపర్‌గా సంజూ స్థానాన్ని ఇషాన్ కిషన్ భర్తీ చేశాడు.

**నాకౌట్ దశలో వరుసగా హాఫ్ సెంచరీలు**

అయితే, కీలక నాకౌట్ మ్యాచ్‌లలో యాజమాన్యం సంజూకు తిరిగి ఓపెనర్‌గా అవకాశం ఇవ్వగా దుమ్ములేపాడు. ముఖ్యంగా సెమీస్ చేరాలంటే వెస్టిండీస్‌తో తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో 97 పరుగులతో అజేయంగా నిలిచాడు ఈ వికెట్ కీపర్ బ్యాటర్. ఆ తర్వాత ఇంగ్లండ్‌తో సెమీస్‌లో 89, న్యూజిలాండ్‌తో ఫైనల్లో 89 పరుగులతో సంజూ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఈ మూడు సందర్భాల్లోనూ అతడి సెంచరీ చేసే అవకాశం కోల్పోవడం గమనార్హం. ఏదేమైనా భారత్ టీ20 వరల్డ్‌కప్-2026 గెలవడంలో కీలక పాత్ర పోషించిన సంజూ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు.

ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో మాట్లాడిన సంజూ తనకు జట్టు ప్రయోజనాలే అత్యంత ముఖ్యమని పేర్కొన్నాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హెడ్‌కోచ్ గౌతం గంభీర్ డ్రెసింగ్ రూమ్‌లో ఎప్పుడూ దీని గురించే మాట్లాడేవారన్నాడు. ప్రతి ఒక్క ఆటగాడు జట్టు విజయం కోసమే శ్రమించాలని దిశా నిర్దేశం చేసేవారని పేర్కొన్నాడు.

**ఆ విషయంలో నేను స్వార్థపరుడినే**

"మా కోచ్ , కెప్టెన్ డ్రెసింగ్‌రూమ్‌లో కొత్త విధానాన్ని తీసుకువచ్చారు. వ్యక్తిగత రికార్డుల కంటే కూడా జట్టు ప్రయోజనాలే ముఖ్యమని.. అందుకు తగ్గట్లే ఆడాలని పదే పదే మాకు చెప్పేవారు. మా నాయకత్వ బృందం నిర్ణయానుసారమే మేమంతా నడుచుకున్నాము. నిజం చెప్పాలంటే ప్రతి ఒక్క ఆటగాడు అలాగే ఆలోచించాలి. నేనైతే నా మనసు చెప్పినట్లే జట్టు ప్రయోజనాల కోసం మాత్రమే ఆడేవాడిని. ఈ విషయంలో నేను స్వార్థపరుడినే. నా పట్ల నేను నిజాయితీగా ఉండటం ద్వారా నాలోని బలహీనతలు అధిగమించడం సులువైంది" అని సంజూ శాంసన్ చెప్పుకొచ్చాడు. కాగా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సైతం ఇటీవలే ఇదే విషయాన్ని నొక్కి వక్కాణించిన విషయం తెలిసిందే. రోహిత్ శర్మ సారథ్యంలో 2024లో టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో అనుభవం ఉందని.. అయితే, తమ జట్టులో యువకులు ఉన్నా జట్టు ప్రయోజనాలకే పెద్దపీట వేశారని అన్నాడు. తద్వారా టీమిండియా మరోసారి వరల్డ్‌కప్ ట్రోఫీ గెలిచిందని పేర్కొన్నాడు.

### ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్‌గా ఇషాన్ కిషన్..
### పాట్ కమిన్స్ స్థానంలో కెప్టెన్సీ బాధ్యతలు



ఐపీఎల్ సీజన్ 2026 ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. జట్టు కెప్టెన్‌గా ఇషాన్ కిషన్‌ను నియమించింది. అయితే, ఈ నిర్ణయం తాత్కాలికమే. ఎస్ఆర్‌హెచ్ జట్టుకు కొన్ని సీజన్ల నుంచి రెగ్యులర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఆస్ట్రేలియా ఆటగాడు పాట్ కమిన్స్ కొన్ని ప్రారంభ మ్యాచులకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో కమిన్స్ ఎస్ఆర్‌హెచ్ జట్టుతో చేరేవరకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఈ విషయాన్ని జట్టు యాజమాన్యం బుధవారం అధికారికంగా వెల్లడించింది. మరోవైపు ఎస్ఆర్‌హెచ్ స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఇటీవలి టీ20 వరల్డ్ కప్‌లో ఇషాన్ కిషన్ అద్భుతంగా రాణించిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో 193 స్ట్రైక్‌రేట్‌తో కిషన్ 317 పరుగులు చేశాడు. ఇక అభిషేక్ శర్మ పూర్తి స్థాయిలో రాణించకపోయినా.. కొన్ని మ్యాచుల్లో తనదైన శైలిలో ఆడి ఆకట్టుకున్నాడు. ఇషాన్ కిషన్ గత ఏడాది ఝార్ఖండ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నమెంట్ (టీ20)లో ఝార్ఖండ్‌ను విజేతగా నిలబెట్టాడు. కెప్టెన్‌గానే కాకుండా బ్యాటర్‌గానూ రాణించాడు. 10 మ్యాచుల్లో 197 స్ట్రైక్ రేట్‌తో 517 పరుగులు చేశాడు. ఫైనల్‌లో సెంచరీ కూడా సాధించి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ట్రోఫీని అందించాడు. అందుకే కెప్టెన్‌గా అనుభవంతో ఈ సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్ జట్టుకు కెప్టెన్‌గా ఇషాన్ కిషన్ మంచి విజయాలను అందిస్తాడని జట్టు యాజమాన్యం భావిస్తోంది. ఒకప్పుడు జాతీయ జట్టులో స్థానం కోల్పోయిన ఇషాన్ కిషన్ ఇప్పుడు అద్భుతమైన ఆట తీరుతో ప్రామిసింగ్ ప్లేయర్‌గా మారాడు. పాట్ ప్రస్తుతం వెన్నెముక గాయంతో బాధపడుతున్నాడు. అందువల్లే ఆయన ప్రారంభ మ్యాచులకు అందుబాటులో ఉండటం లేదు.

### రికార్డు స్థాయి బిడ్..
### తుది దశకు ఆర్సీబీ అమ్మకం!



ఐపీఎల్లో 2025లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) చాంపియన్‌గా నిలిచింది. అయితే 17 సీజన్ల పాటు కింగ్‌ఫిషర్ కంపెనీ నిర్వహిస్తూ వచ్చిన ఆర్బీబీ ఫ్రాంచైజీని అమ్మకానికి పెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా ఆర్సీబీ అమ్మకం ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. స్వీడన్?కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ఈక్యూటీ భారీ బిడ్ పెట్టినట్లు సమాచారం. మరోవైపు మణిపాల్ హాస్పిటల్స్ అధినేత రంజన్ ?పై, అమెరికా సంస్థ కోల్‌బెర్గ్ క్రావిస్ రాబర్ట్స్ అండ్ కో (కేకేఆర్), సింగపూర్ ఇన్వెస్ట్మెంట్ గ్రూప్ టెమాసెక్ కలసిన కన్సార్టియం కూడా పోటీలో ఉంది. కాగా మొత్తం డీల్ విలువ సుమారు 2 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని అంచనా. ప్రారంభంలో మాంచెస్టర్ యునైటెడ్ సహ యజమానులు గ్లేజర్స్, అదార్ పూనావాలా కూడా ఆసక్తి చూపినప్పటికీ చివరికి రేసు నుంచి తప్పుకున్నారు. గ్లేజర్స్ సుమారు 1.8 బిలియన్ డాలర్ల నాన్ బైండింగ్ ఆఫర్ ఇచ్చినట్లు, అయితే ఈక్యూటీ దాన్ని దాటేలా బిడ్ పెంచినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ డీల్ సూటిగా బిడ్డింగ్ పోరుగా మారింది. దయాజియో గ్రూప్ మార్చి 31ని గడువుగా పెట్టి ఈ అమ్మకాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఇదే సమయంలో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీని కొనుగోలు చేయడం వెనుక కూడా ఈ సంస్థలు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. మూడు సంస్థలు బైండింగ్ బిడ్లు సమర్పించినట్లు తెలుస్తోంది. ఆదిత్య బిర్లా గ్రూప్ ఫేవరెట్?గా నిలుస్తోంది. మొదట మెజారిటీ వాటా అమ్మాలని భావించిన రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం ఇప్పుడు పూర్తి విక్రయానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఫ్రాంచైజీ విలువ 1.1 బిలియన్ నుంచి 1.35 బిలియన్ డాలర్ల మధ్య ఉండొచ్చని అంచనా. రైన్ గ్రూప్ ఈ అమ్మక ప్రక్రియను పర్యవేక్షిస్తోంది. అమెరికాకు చెందిన డేవిడ్ బ్లిట్జర్, ఆదిత్య బిర్లా గ్రూప్ కలిసి కన్సార్టియంగా బిడ్ సమర్పించినట్లు తెలుస్తోంది. మార్చి 31 ఈ డీల్ కూ కీలక గడువుగా ఉంది. అయితే ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుకు అభిమానులు చాలా మంది ఉంటారు. ఖరీదైన జట్టుగా పేరున్న ఆర్సీబీని దక్కించుకోవడానికి రెండు ప్రధాన సంస్థలు పోటీలో ఉన్నాయి. అంతిమంగా ఐపీఎల్ ఫ్రాంచైజీల విలువలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో, ఆర్సీబీ అమ్మకం ఫ్రాంచైజీ క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద డీల్స్‌లో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది.

## నటనపై ప్రేమతోనే అలా అడిగేదాన్ని



సరైన సమయం వచ్చినప్పుడు.. ఎంత కష్టమైనా పడి హిందీ, దక్షిణాది చిత్ర పరిశ్రమల్లో నా కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకోవాలనుకుంటున్నానని అంటోంది అందాల తార మృణాల్ ఠాకూర్. గుర్తుండిపోయే పాత్రల్ని ఎంచుకోవడంలో ముందు వరుసలో ఉండే నాయిక ఈమె. గతేడాది 'సన్ ఆఫ్ సర్దార్ 2'తో సందడి చేసిన మృణాల్.. 2025 కన్నా రెట్టింపు ఉత్సాహంతో ఈ సంవత్సరంలో సందడికి రంగం సిద్ధం చేసుకుంటోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ తన సినీ కెరీర్ గురించి కొన్ని కబుర్లు పంచుకుంది 'నేను కెరీర్ ప్రారంభించినప్పుడు.. ఇలా చేయాలి.. అలా చేయాలి అని నా ప్రణాళికలో చాలా విషయాలు ఉండేవి. కానీ అప్పుడు వాటికి అనుకూలమైన పరిస్థితులు లేవు. ఉత్తరాది, దక్షిణ చిత్రాల మధ్య కెరీర్‌ను బ్యాలెన్స్ చేస్తూనే ముందుకు వెళ్లాలనుకుంటున్నా. తమిళ పరిశ్రమలోకి కూడా అడుగుపెట్టాలనే ఆలోచన ఉంది. చాలా కథలు వింటున్నాను. మంచి స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్నా. అయినా నాకు భాషతో అవసరం లేదు. భావోద్వేగాలే ముఖ్యం. ఉత్తమ కథలు దొరికినప్పుడు వివిధ భాషల్లో పని చేయాలని కోరుకుంటున్నా". 'చిత్రపరిశ్రమలోకి బయటి వ్యక్తిగా అడుగుపెట్టడం, అవకాశాలు అందుకోవడం సవాలుతో కూడుకున్న పని. బాలీవుడ్‌లో నా తొలినాళ్లు చాలా కష్టంగా గడిచాయి. కాలక్రమేణా.. ఆ అడ్డంకులను దాటుకొని నటిగా ఎదగడానికి అవకాశాలను ముందుగానే వెతకడం నేర్చుకున్నా. నేను నటించిన 'దో దీవానే సెహర్ మే' నా దగ్గరికి అలా వచ్చిన సినిమానే. ఈ చిత్ర దర్శకుడు రవి ఉద్యవార్‌ని నేరుగా సంప్రదించాను. 'మామ్' చూసిన తర్వాత 'నేను మీతో పనిచేయాలనుకుంటున్నా'నని చెప్పా. ఇలా చొరవ తీసుకొని అడగడం కొత్త కాదు. నిజానికి నేను పని కోసం సంప్రదించిన మొదటి దర్శకుడు ఆదిత్య ధర్. అవకాశాలు నాకంత తేలికగా రాలేదు. వాటిని సృష్టించుకోవాలి. వెంబడించాలి. దర్శకులు నా ముఖం చూసేలా చేసుకోవాలి. అయినా ఇలాంటి పనులు చేయడానికి నేను సిగ్గుపడను.



## 'యూత్' తెలుగు ట్రైలర్ రిలీజ్

తమిళ నటుడు కరుణాస్ వారసుడు కెన్ కరుణాస్? హీరోగా పరిచయమవుతున్న చిత్రం యూత్. ఈ మూవీకి కెన్ కరుణాస్ స్వీయ దర్శకత్వం వహించడం విశేషం. జీవీ ప్రకాశ్ కుమార్ పైసా పారితోషికం తీసుకోకుండా ఫ్రీగా సంగీతం అందించాడు. ఇటీవలే తమిళ ట్రైలర్ రిలీజ్ చేయగా మంచి స్పందన లభించింది. తాజాగా యూత్ తెలుగు ట్రైలర్ వదిలారు. 'మీకు పుట్టినవాడు సాధారణమైన అబ్బాయి కాదు మేడమ్.. ఆ దేవుడే మీకు బిడ్డగా పుట్టాడు. వాడిని బ్యాడ్ బాయ్స్‌తో చేరనివ్వకండి' అన్న సంభాషణతో వీడియో మొదలవుతుంది. తీరా హీరో.. తనను ముగ్గురమ్మాయిలు ప్రేమిస్తున్నారని తెగ సంబరపడిపోతాడు. ఫైటింగ్, లవ్, కామెడీకి ఏమాత్రం కొదవ లేనట్లుగా చూపించారు. ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ అనేలా ట్రైలర్ కట్ చేశారు. ఈ సినిమా మార్చి 26న విడుదల కానుంది.

## శర్వాకు జోడీగా టాలీవుడ్ బుట్టబొమ్మ!



చార్మింగ్ స్టార్ శర్వా నంద్ ప్రస్తుతం 'భోగి'తో బిజీగా ఉన్నాడు. ఈ భారీ పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామాకు సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నాడు. శర్వా కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన వెంచర్‌లలో ఒకటిగా రూపొందుతోన్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన పలు అప్డేట్స్ సూపర్ బజ్ క్రియేట్ చేశాయి. ఇక ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా.. శర్వా మరో చిత్రానికి సిద్ధం అయ్యాడు. ఈ మేరకు దర్శకుడు శ్రీను వైట్లతో చేతులు కలిపాడు. శర్వానంద్, శ్రీను వైట్ల కాంబోలో వస్తున్న ఈ క్లీన్ ఎంటర్టైనర్, సైన్స్ ఫిక్షన్ మూవీలో ఇండస్ట్రీలో హ్యాపెనింగ్ కమెడియన్స్ వెన్నెల కిషోర్, సత్య, బుల్లి రాజు కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రజెంట్ స్క్రిప్ట్ వర్క్ జరుగుతుండగా.. జూన్ లేదా జులై నుంచి షూటింగ్ ఉండచ్చని ఫిలిమ్ వర్గాల నుంచి టాక్. 2027 సంక్రాంతి టార్గెట్‌గా రూపొందబోతున్న ఈ చిత్రం నుంచి తాజాగా మరో ఇంట్రెస్టింగ్ న్యూస్ వచ్చింది. ఇందులో ఫీమేల్ లీడ్ కోసం టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డేను సంప్రదించగా.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిస్తుంది. అనుకున్నవి అనుకున్నట్లు జరిగితే త్వరలోనే దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశాలు ఉన్నాయి.



## 'ధురంధర్ 2' తెలుగు ప్రీమియర్లు క్యాన్సిల్?.. అసలు కారణం ఇదే!

బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో రాబోతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ 'ధురంధర్: ది రివెంజ్' తెలుగు ప్రీమియర్ల కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు నిరాశ ఎదురైంది. కంటెంట్ డెలివరీలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా నేడు (మార్చి 18) ప్లాన్ చేసిన అన్ని తెలుగు వెర్షన్ పెయిడ్ ప్రీమియర్ షోలను అధికారికంగా రద్దు చేశారు. ఇప్పటికే బుక్‌మైషో, పేటీఎం వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి ఈ షోల బుకింగ్స్‌ను తొలగించడమే కాకుండా, టికెట్లు కొనుగోలు చేసిన ప్రేక్షకులకు పూర్తి మొత్తాన్ని వెనక్కి ఇచ్చే రీఫండ్ ప్రక్రియను కూడా నిర్వాహకులు ప్రారంభించారు. ఈ సాంకేతిక ఇబ్బందుల ప్రభావం కేవలం తెలుగు మరియు ఇతర ప్రాంతీయ భాషా ప్రీమియర్లపైనే పడగా, హిందీ వెర్షన్ కంటెంట్ అందుబాటులో ఉండటంతో నగరంలోని కొన్ని ప్రధాన మల్టీప్లెక్స్‌లలో హిందీ షోలు యథావిధిగా కొనసాగే అవకాశం ఉంది. సుమారు 3 గంటల 49 నిమిషాల సుదీర్ఘ నిడివితో, 'ఏ' సర్టిఫికేట్ పొందిన ఈ భారీ చిత్రం రేపు ఉదయం నుంచి ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషల్లో ప్లాన్ చేసిన విధంగానే గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రీమియర్ షోల రద్దుతో నిరాశ చెందిన ప్రేక్షకులు తమ రీఫండ్ స్టేటస్ గురించి సంబంధిత యాప్స్ లేదా థియేటర్ యాజమాన్యాన్ని సంప్రదించాలని చిత్రబృందం సూచించింది.



## ఆగిపోయింది అనుకున్న సినిమా మళ్లీ స్టార్ట్

గత కొంతకాలంగా వరుస పరాజయాలు చవిచూస్తున్న మ్యాచో స్టార్ గోపిచంద్ ప్రజెంట్ ఒక సాలిడ్ హిట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలోనే ప్రస్తుతం సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా షూటింగ్ ముగింపు దశకు చేరుకోగా.. ఇప్పుడు తన తదుపరి చిత్రంపై ఫోకస్ పెట్టాడు. డెబ్యూ డైరెక్టర్ కుమార సాయి దర్శకత్వంలో గోపీచంద్ 2025లో ఒక ప్రాజెక్ట్ అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం గ్రాండ్‌గా లాంచ్ అయినప్పటికీ.. కొన్ని అనివార్య కారణాల చేత ఆగిపోయింది. ఇక ఈ సినిమా పూర్తిగా ఆగిపోయిందని భావించారు. కానీ తాజాగా ఈ మూవీకి సంబంధించిన అప్డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమా అనౌన్స్ చేసిన నిర్మాణ సంస్థ నుండి రాబోతున్న నాగచైతన్య చిత్రం 'వృషకర్మ' షూటింగ్ పూర్తి కావడంతో.. మేకర్స్ ఇప్పుడు గోపీ చంద్ సినిమాపై ఫోకస్ పెట్టారట. దీంతో ఆగిపోయిన ఈ ప్రాజెక్టు ఇప్పుడు మళ్లీ పట్టాలెక్కడానికి సిద్ధమైందని తెలుస్తుండగా.. తాజా షెడ్యూల్ విదేశాల్లో ప్లాన్ చేశారు మేకర్స్. ఈ సంవత్సరం చివరి వరకు షూటింగ్ పనులు పూర్తి చేసుకుని 2027లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా ప్లాన్ చేస్తున్నారట. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన న్యూస్ వైరల్ అవుతుండగా.. ఆగిపోయింది అనుకున్న ప్రాజెక్టు మళ్లీ స్టార్ట్ కావడంతో గోపీ చంద్ అభిమానులు ఖుష్ అవుతున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com